J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 44 07.04.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## పెరుగుతున్న ఎన్నికల వేడి - రాష్ట్ర నేతల హడావుడి

# ఇక్కడ జగన్ - అక్కడ పవన్

### వరుస సమావేశాలు



ఒక్కరిని కూడా వదులుకోబోమంటున్న జగన్



వ్యతిరేక ఓటును చీలనీయబోమంటున్న పవన్

**తాజాగా జరిగిన శాసనమండలి ఎన్నికలు ప్రతిపక్షాలలో ఆశలని, అధికార పార్టీలో ఆలోచనలని రేకెత్తించాయన్న విషయం స్పష్టమైపోతుంది. సమీక్షా సమావేశాల పేరిట పార్టీని చక్కదిద్దే పనిపై అధికార పార్టీ దృష్టిపెట్టింది. మరోవైపు జనసేనాని పవన్ కళ్యాణ్ స్పీడు పెంచారు. పొత్తులపై స్పష్టత కోసం ఢిల్లీ బాట పట్టారు. మొత్తం మీద ఏప్రిల్ 3, 4తేదీలలో రాష్ట్రంలో జగన్, ఢిల్లీలో పవన్ వరుస సమావేశాలతో రాజకీయవర్గాలలో చర్చకి తెరలేపారు.**

"పూర్తిగా భూస్థాపితమైపోయిందని తాము భ్రమపడుతుండిన తెలుగుదేశం పార్టీ 4 ఎమ్మెల్సీ సీట్లను దక్కించుకోవడంతో అధికారపార్టీ ఆలోచనలో పడింది. ఏప్రిల్ 3వ తేదీన మంత్రులు, ఎంపీలు, ఎంఎల్ఏలు, జిల్లా అధ్యక్షులతో సహా ఇతర నాయకులందరితో తాడేపల్లిలో జగన్ పెట్టిన సమావేశంలో ఆయనలో స్పష్టమైన మార్పు కనిపించింది. స్వతహాగా ఆధిపత్య ధోరణిలో ఉండే జగన్ స్వరం ఈసారి మారింది. గత సమావేశాలలో గడప గడపకి సరిగ్గా తిరగని వారి జాబితా చేత బట్టుకుని వారి పేర్లను బోర్డుపై రాసిమరీ హెచ్చరించిన ముఖ్యమంత్రి, ఈసారి తన పంథా మార్చుకున్నారు. శాసించే విధానాన్ని పక్కనపెట్టి... లాలించే పద్ధతిని అవలంభించారు. నిన్నటివరకు నా వల్లనే మీరంతా గెలిచారు, మళ్ళీ నా వల్లనే గెలుస్తారు అని చెప్తూండిన జగన్, ఇప్పుడు మాట మార్చారు. మీరే నా ధైర్యం... మీరు లేకుంటే పార్టీ లేదు. ఏమైనా అనివార్య కారణాల వలన ఎవరికైనా టిక్కెట్లు ఇవ్వలేకపోతే, ఎమ్మెల్సీ

10లో



జననం : 01-07-1947 మరణం : 27-03-2023

## శ్రద్ధాంజలి

### కీ॥శే॥ శ్రీ చెన్ను బాలకృష్ణారెడ్డి గారు

రాపూరు మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు, వైసిపి సీనియర్ నేత, నెల్లూరుజిల్లా.

ప్రేమానురాగాలతో మా అందరికి వెలుగునిచ్చి...
జీవనజ్యోతిగా ఆఖరివరకు దారి చూపావు.
అలసి సొలసిపోయి.. విశ్రమించిన... మీ పాదాలకు
మా హృదయపూర్వక నివాళులు అర్పిస్తూ...
మీ జ్ఞాపకాలతో ముందుకు సాగుతూ...
**మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...**

మెట్టుకూరు ధనంజయరెడ్డి - మెట్టుకూరు సంపూర్ణమ్మ
కోడూరు రామకృష్ణారెడ్డి - మెట్టుకూరు నాగజ్యోతి
డా॥ గోపినాథ్‌రెడ్డి - డా॥ మెట్టుకూరు అనీష
పార్థ్‌రెడ్డి, భగత్‌రెడ్డి

# సత్యకుమార్‌పై దాడి దారుణం

## బిజెపి నాయకుడు కర్నాటి



అమరావతి రాజధాని కోసం ఉద్యమిస్తున్న వారిని పరామర్శించి వస్తున్న బిజెపి జాతీయ నాయకుడు సత్యకుమార్‌పై దాడి దారుణమని, గతంలో టీడీపీకి పట్టిన గతే త్వరలో వైసీపీకి పట్టబోతోందని బిజెపి రాష్ట్ర అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి అన్నారు. ఈనెల 1న నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. సత్యకుమార్‌పై దాడి జరుగుతుంటే అక్కడున్న పోలీసులు పట్టించుకోకపోవడం ఘోరమని, రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారిపోయాయన్నారు. వైసీపీ ప్రభుత్వ దుర్మార్గాలను సహించేది లేదని, రాజకీయ కక్షలకు పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడిన వైసీపీ వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

### జిల్లాలో రైతుల పట్ల వివక్ష:

జిల్లాలో రైతుల పట్ల వివక్ష చూపడం తగదని, రైతాంగానికి నీరందించేందుకు నిర్ణయాలు తీసుకునే ఐఏబి సమావేశానికి కూడా అధికారపార్టీ ఎమ్మెల్యేలు రాకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. జగన్ అధికారంలోకి వచ్చినప్పటినుంచి రైతాంగాన్ని పట్టించుకునేవారే లేరని, దీంతో రైతుల సమస్యలు పెరిగిపోతున్నాయని అన్నారు. రైతుల కోసం కొనుగోలు కేంద్రాలు పెడ్తామని చెప్పారే తప్ప నామమాత్రంగానే వాటిని ఏర్పాటుచేశారని, ఖరీఫ్ సీజన్ ముగిసినా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు అత్యంత మందకొడిగా ఉందని, ఐఏబి సమావేశంలో రైతులకు 4 లక్షలా 25వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారని, కానీ పంటపొలాలకు నీరు వెళ్లే పంటకాలువల్లో పూడిక తీసే చర్యలు మాత్రం తీసుకోలేదని ఆయన అంటూ, చివరి ఆయకట్టు దాకా, ప్రతిరైతుకు నీరందిస్తామని అంటారే కానీ, అవన్నీ ఆచరణలోకి రావడం లేదని, ఇకనైనా ప్రభుత్వం, జిల్లా అధికారులు శ్రద్ధ తీసుకుని వెంటనే రైతుల సమస్యలు తీర్చాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా కార్యదర్శి కాయల మధు, నాయకులు కాలం బుజ్జిరెడ్డి, కుడుముల గిరికుమార్ గౌడ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్‌పై అనర్హతను ఉపసంహరించుకోవాలి

## --- డిసిసి నేత చేవూరు దేవకుమార్‌రెడ్డి ---




అఖిలభారత కాంగ్రెస్ అగ్రనాయకుడైన రాహుల్ గాంధీపై విధించిన లోకసభ సభ్యత్వ అనర్హత వేటును వెంటనే ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆస్తుల పరిరక్షణ కమిటీ ఛైర్మన్, నెల్లూరుజిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు.దేవకుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రాహుల్‌గాంధీపై లోకసభ సభ్యత్వ అనర్హత వేటును ఖండిస్తూ నెల్లూరుజిల్లా కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ఇందిరాభవన్ నుంచి స్థానిక గాంధీబొమ్మ సెంటర్ కూడలి వద్ద గల జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం వరకు ఇటీవల కాంగ్రెస్ నాయకులు కాగడాల ప్రదర్శన నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ పాలనలో దేశానికి చీకటి రోజులు దాపురించాయని, దేశాన్ని చక్కగా పాలించడం చేతగాక ప్రతిపక్ష పార్టీలను, బీజేపీయేతర నాయకులపై అక్రమ కేసులు పెట్టడం పరిపాటిగా మారిందని ఆయన ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. భారత్ జోడో యాత్రతో దేశవ్యాప్తంగా ప్రజల్లో విశేష ఆదరాభిమానాలు సంపాదించుకున్న రాహుల్ గాంధీపై ఈర్ష్యతోనే ఆయనపై లోకసభ సభ్యత్వ అనర్హత వేటు వేశారని, కుటిల రాజకీయాలతో కేవలం కాంగ్రెస్ పార్టీని ఇబ్బందులకు గురిచేయడం కోసం బీజేపీ నరేంద్రమోదీ అండ్ కో ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, నరేంద్రమోదీ ఎన్నెన్ని పన్నాగాలు పన్నినా కాంగ్రెస్ పార్టీని, రాహుల్‌గాంధీని దేశ ప్రజల నుంచి వేరు చేయలేరన్నారు. ఈ ఆందోళనలో పీసీసీ అధికార ప్రతినిధి లేళ్లపల్లి సురేష్‌బాబు, నాయకులు ఉడతా వెంకట్రావు, చింతాల వెంకట్రావు, షేక్ ఫయాజ్, దుద్దుకూరు రమేష్ నాయుడు, సేవాదళ్ అధ్యక్షులు కొండా అనిల్ కుమార్, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు మహేష్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అన్నం లత, మైనారిటీ అధ్యక్షుడు అల్లావుద్దీన్, ఎస్సీసెల్ అధ్యక్షుడు పవన్ కుమార్, ప్రధాన కార్యదర్శి రాజేష్‌రెడ్డి, మండలాధ్యక్షులు రాజగోపాల్‌రెడ్డి, బిట్రా కిషోర్, సుజాత, మంజుల, ఖాజా మస్తాన్, మహబూబ్‌బాషా, రిజ్వాన, మున్నా, హాజీ హనీఫ్, ఫజులుద్దీన్, మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## బుచ్చి కోదండరామునికి..

# వైభవంగా గరుడసేవ

బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రముఖ దేవాలయం సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 3వ తేదీ రాత్రి గరుడసేవ అత్యంత వైభవంగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తొలుత స్వామివారిని ఆలయ అర్చకులు శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం మోహినీ అవతారంలో స్వామివారు భక్తులకు కనువిందు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.

## కోనలో నిత్యాన్నదానానికి

# లక్ష విరాళం



రాపూరు మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి నెల్లూరులోని రామలింగాపురానికి చెందిన గడ్డం పెంచల నిహార్ లక్ష రూపాయలను విరాళంగా సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకునికి ఆ మొత్తాన్ని అందజేయగా, దాతలను, వారి కుటుంబసభ్యులను అర్చకులు ఆశీర్వదించారు.

## 10వ తరగతి విద్యార్థులకు

# విద్యా సామాగ్రి



నెల్లూరులోని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక రామ్మూర్తినగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కృష్ణపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. వేమారెడ్డి చేతులమీదుగా పరీక్ష అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతమైన స్థాయిలో రాణించాలని ఎస్ఐ విద్యార్థులకు చెప్పారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీ మోహన్‌రాజు, స్వచ్ఛంద సేవా సంస్థల గౌరవాధ్యక్షుడు ముదిగొండ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, సంస్థ సభ్యులు టి.వెంకటేశ్వర్లు, రచయిత వేమూరి మురళి తదితరులు పాల్గొన్నారు.




# ఎమ్మెల్సీ పర్వతరెడ్డికి బాల్యమిత్రుల ఆత్మీయ సత్కారం

నెల్లూరులోని కృష్ణచైతన్య కళాశాలలో ఇటీవల ఎమ్మెల్సీగా గెలుపొందిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి ఆయన బాల్యమిత్రుల ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా బాల్యమిత్రులు ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని కలుసుకుని పాఠశాల, కళాశాల రోజులనాటి పలు విషయాలను గుర్తుచేసుకొని ఆత్మీయంగా గడిపారు. అనంతరం వారు చంద్రశేఖర్‌రెడ్డిని అభినందించి సత్కరించారు. ఎమ్మెల్సీగా చంద్రశేఖర్‌రెడ్డి మరింతపేరు తెచ్చుకోవాలని మిత్రులు ఆకాంక్షించారు.

## రైతుభరోసా కేంద్రానికి

# తాళం వేసిన రైతులు

## ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలంటూ ఆందోళన



రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు వెంటనే కొనుగోలు చేయాలంటూ ఈనెల 1న జలదంకి మండలంలోని కమ్మవారిపాళెం రైతులు గ్రామంలోని రైతుభరోసా కేంద్రానికి, గ్రామ సచివాలయానికి తాళాలు వేసి ఆందోళన చేశారు. కొద్దిరోజుల క్రితం అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోవడంతో ఎంతో నష్టపోయామని, మళ్ళీ వాతావరణం మారి వానలు కురిసే అవకాశం ఉండడంతో, వెంటనే తమ వద్ద ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే తమ పరిస్థితి దయనీయంగా మారుతుందని వారు గోడుగోడుమన్నారు. కోతకోసిన ధాన్యాన్ని ఆరబెట్టి దాదాపు 18వేల బస్తాలదాకా నిల్వ ఉంచామని, అయినా నెలరోజులు గడిచినా ఒక్కబస్తా ధాన్యాన్ని కూడా కొనకపోవడం దారుణమని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకుంటే తమకిక ఆత్మహత్యలే గతి అని వారు పురుగుల మందు డబ్బాలను చేతపట్టుకువచ్చి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వారు కోరారు. రైతుల నిరసన తెలుసుకున్న పౌరసరఫరాల డిఎం హుటాహుటిన వచ్చి ఈనెల 6 నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

# నిరుద్యోగుల్ని నట్టేట ముంచారు

## ప్రభుత్వంపై డివైఎఫ్ఐ ధ్వజం




రాష్ట్రంలో బిఇడి, టిటిసి పూర్తి చేసిన నిరుద్యోగులు దాదాపు పది లక్షల మంది వరకు ఉన్నారని, వీరంతా ఎంతోకాలంగా డిఎస్సి నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని, అయితే రాష్ట్రప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించి వారిని నట్టేట ముంచుతున్నారని డివైఎఫ్ఐ నాయకులు ధ్వజమెత్తారు. ఈనెల 3న డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలో 'చలో కలెక్టరేట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. మెగా డిఎస్సీ నిర్వహించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. అనంతరం డిఆర్‌ఓకి వినతిపత్రం అందజేశారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బిపి నరసింహ, కార్యదర్శి ఎంవి రమణ, నాయకులు కోటేశ్వరరావు, జగదీష్, శేఖర్, చైతన్య, ఫయాజ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# జీతాలిప్పించండి సారూ!

## ఆబ్కాస్ ఉద్యోగుల వినతి

గత తొమ్మిది నెలలుగా తమకు జీతాలివ్వకపోవడంతో తమ కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారిందని, మీరైనా జోక్యం చేసుకుని జీతాలిప్పించండని అభ్యర్థిస్తూ ప్రభుత్వ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో, నెల్లూరు పెద్దాసుపత్రిలో పనిచేస్తున్న ఆబ్కాస్ ఉద్యోగులు ఈనెల 3న జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రభుత్వ వైద్యకళాశాలలో పనిచేస్తున్న 31 మంది ఆబ్కాస్ ఉద్యోగులకు జీతాలివ్వాల్సి ఉందని వారు జేసీ దృష్టికి తీసుకువచ్చారు. తొలుత, నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు.

# సేవా సంస్థకీ 'రాజకీయ ముసుగు'

- హోరాహోరీగా రెడ్ క్రాస్ ఎన్నికలు
- ముగిసిన పోలింగ్... ఆగిన కౌంటింగ్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా శాఖకు చిన్నంగా రాజకీయ ముసుగు తగిలించారు. మూడేళ్లనాడు పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఛైర్మెన్ అభ్యర్థిత్వంతో ఒక్కసారిగా వార్తలలోకి వచ్చిన రెడ్ క్రాస్ ఎన్నికలు, ఈసారి ఏకంగా హైకోర్టు మెట్లు ఎక్కేదాకా వెళ్లాయి. సభ్యుల సంఖ్య 15 నుండి 18కి పెంచగా, మళ్ళీ కోర్టు జోక్యంతో అది 15కి మారింది.

రెడ్ క్రాస్ ఛైర్మెన్ హోదా నుండి ఎంఎల్సీగా పదోన్నతి సాధించిన చంద్రాని చూసి కొంతమంది రెడ్ క్రాస్‌ని సెంటిమెంటుగా తీసుకున్నారు కాబోలు. ఈసారి బరిలో అంతా ప్రముఖులు దిగారు. ఎన్నికలను అసెంబ్లీ ఎన్నికల తరహాలో నిర్వహించారు. సెల్‌ఫోన్లలో ప్రచారం హోరెత్తిపోయింది. గత 10 రోజులుగా రెడ్ క్రాస్ సభ్యులకు ఈ రికార్డెడ్ మెసేజీలు వినడానికే సమయమంతా సరిపోయింది. పోనీ ఆ నెంబర్లను బ్లాక్ చేద్దామా అంటే.. ఒకసారి వచ్చిన నెంబర్ల నుండి మరోసారి కాల్ వచ్చేది కాదు. ఈసారి విచిత్రంగా రెడ్ క్రాస్ ఉద్యోగులు కూడా ఫోన్‌చేసి మీరు పలానావారికి ఓటేయండి అని అడగడం ఆశ్చర్యకరం.

మొత్తానికి ఏప్రిల్ 2వతేది ఎన్నికలు ముగిశాయి. 7138 మంది జీవిత సభ్యులకుగాను 4000 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చాలా మంది జీవితసభ్యులు అసలు తమ ఓటే జాబితాలో లేకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకువెళ్లారు. ఓటు గల్లంతైన వారిలో నగర రెండవ మేయర్ నంది మండలం భానుశ్రీ, సీనియర్ పాత్రికేయుడు దయాశంకర్ కూడా ఉండడం విశేషం.

సామాజిక కార్యకర్తగా చెప్పుకునే ఒక పెద్దాయన కోర్టుకి వెళ్లి కౌంటింగ్‌పై స్టే తెచ్చారు. పోలింగ్ జరిగింది, కౌంటింగ్ ఆగింది. పోటీచేసిన వారి భవిష్యత్ భద్రంగా బాక్సుల్లో ఉంది. ఈ సస్పెన్సు ఎన్నిరోజులో పాపం..! మొత్తానికి రెడ్ క్రాస్ సేవాసంస్థ ఎన్నిక ఈసారి భలే రంజుగా సాగింది. ఇంకా రానున్న రోజుల్లో ఎలా ఉండబోతోందో వేచి చూడాల్సిందే!

# భారీ స్థాయిలో ఐఏఎస్, ఐపిఎస్‌ల స్థానచలనం?

## జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎస్పీ విజయారావుల బదిలీ!

ఎన్నికల ఏడాది మొదలైన తరుణంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా భారీస్థాయిలో ఐఏఎస్, ఐపిఎస్‌ల బదిలీల ప్రక్రియను చేపట్టబోతున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీర్ఘకాలంగా నెల్లూరులో విధులు నిర్వహిస్తూ.. జిల్లా ప్రజల మనసులు దోచుకున్న కలెక్టర్ చక్రధర్‌బాబు, ఏడాదిన్నర క్రితం బదిలీపై జిల్లాకు వచ్చిన ఎస్పీ విజయారావులకు కూడా స్థానచలనం కలగనున్నట్లు తెలుస్తోంది. చిత్తూరుజిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న హరినారాయణ్ నెల్లూరుజిల్లా కలెక్టర్‌గా నియమించనున్నట్లు వార్త! పోలీసుశాఖ జిల్లా కొత్త బాస్ ఎవరన్నది ఇంకా స్పష్టత రాలేదు. అనంతపురం జిల్లా ఎస్పీ ఫకీరప్ప పేరు చెక్కర్లు కొడుతున్నప్పటికీ, ఆయనతోపాటు మరో ఇద్దరు కూడా ముఖ్యమంత్రి దృష్టిలో ఉన్నట్లు సమాచారం. ఇప్పుడు కొత్తగా జిల్లాలో నియమింపబడే ఐఏఎస్, ఐపిఎస్‌లు రాబోవు సార్వత్రిక ఎన్నికలవరకు జిల్లాలలోనే ఉండే అవకాశం ఉంది కాబట్టి, ప్రభుత్వం ఆచితూచి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే బదిలీల చిట్టా తయారైపోయిందని, ముఖ్యమంత్రి వద్ద సిద్ధంగా ఉందని తాడేపల్లి సమాచారం. ఎమ్మెల్సీ ఎన్నికల ముందునుంచే ఈ ఆలోచన ఉన్నప్పటికీ, ఎన్నికల కోడ్ తదితర అంశాల దృష్ట్యా వాయిదాపడుతూ వచ్చింది. ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం వచ్చిన ఫలితాలు, జరుగుతున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా ఎన్నికలకు ముందు రూపొందించిన బదిలీల చిట్టాలో మార్పు చేర్పులు చోటుచేసుకోవడం ఖాయమని అధికార వర్గాల భోగట్టా! మొత్తానికి ఒకేసారి జిల్లా ఉన్నతాధికారులిద్దరూ బదిలీపై వెళ్ళడం మాత్రం ఖాయమని సమాచారం.

# అయ్యా..! ఎస్.పి సారూ...

# నన్ను పట్టించుకోరూ!



నా పేరు మాగుంట లేఅవుట్ అవుట్ పోస్ట్. ఒకప్పుడు కళకళలాడుతూ వైభవంగా వెలిగిపోయాను. నేరస్తులను గడగడలాడించాను. కంటికి కునుకు లేకుండా కాపలా కాశాను. నా పరిసరాల్లో నివసించే వారికి భద్రతపై భరోసాని, కొండంత ధైర్యాన్ని కల్పించాను. మారుతున్న కాలంతో పాటు ఆధునిక హంగులతో నన్ను ఇంకా ఆధునికరించి ప్రకాశింపచేస్తారని ఆశపడ్డాను. కానీ, గత కొన్ని సంవత్సరాలుగా నాకు దిక్కు మొక్కు లేకుండా చేసి నన్ను అనాథలా వదిలేశారు. నా చుట్టూ జరుగుతున్న నేరాలకు, ఘోరాలకు, అసాంఘిక కార్యక్రమాలకు నన్ను సాక్షిభూతంగా మార్చేశారు.

# అనాధగా మారిన ఓ "అవుట్"పోస్ట్ ఆవేదన








అప్పటి నెల్లూరు ఎస్పీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించిన శంకుస్థాపన, ప్రారంభోత్సవ శిలాఫలకాలు

## ఇప్పుడున్న పోలీసు పెద్దదొరే... అప్పట్లో నన్ను నియమించారు!

2002లో అంటే దాదాపు 20 సంవత్సరాల క్రితం, ఇప్పుడు రాష్ట్రపోలీసుకి పెద్దదిక్కుగా ఉన్న కే.వీ.రాజేంద్రనాథ్‌రెడ్డే నేను ఇక్కడ అవతరించడానికి ముఖ్య కారకులు. అప్పుడప్పుడే అభివృద్ధి చెందుతున్న మాగుంట లే అవుట్ పురోగతిని ఇరవై ఏళ్ళనాడే ఊహించిన ఆ పెద్దసారు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నన్ను ఇక్కడ ఏర్పాటు చేయాలని ప్రతిపాదన చేశారు. ఆయన ప్రతిపాదించిన వెంటనే మాగుంట లే అవుట్ అసోసియేషన్ వారు మాగుంట కుటుంబం సహాయంతో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సుమారు 35 అంకణాల స్థలం చూపించి నా కోసం కేటాయించారు. కొంతమంది దాతలు పెద్దమనసుతో ఇచ్చిన నిధులతో 2002 జూన్ 12న భూమిపూజ చేసి నా రూపకల్పనకు రాజేంద్రనాథ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. నన్ను సుందరంగా నిర్మించి 2003 ఫిబ్రవరి 22వ తేదీన మళ్ళీ ఆయనే ఆర్భాటంగా ప్రారంభించారు. ఈ ఏడాది, అంటే 2023 ఫిబ్రవరి 22న నా 20వ వార్షికోత్సవం కూడా జరిగింది. కానీ, నా బ్రతుకే ఇప్పుడు చీకట్లో ఏడ్చింది. అతీగతీ లేకుండా దైన్యంగా తయారయ్యింది.

గత కొన్ని సంవత్సరాలుగా, అంటే సుమారు పదేళ్లకుపైగా నన్ను పట్టించుకున్న నాథుడే లేదు. నా టేబుళ్లు కుర్చీలు కూడా ఎవడో దోచుకెళ్ళాడు. దొంగతనాలని, దోపిడీలని నివారించడానికి నిఘాకోసం ఏర్పడ్డ నేను, నా ఆస్తులు దోచుకెళ్తున్నా ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో చూస్తుండిపోయాను. నా ప్రాంగణమంతా దుర్గంధ భూయిష్టంగా తయారయ్యింది. నా పుట్టింటోళ్లే(పోలీసుశాఖ) నన్ను అనాధగా మార్చేయడంతో, నా మెట్టినింటోళ్ళు (మాగుంట లే అవుట్ అసోసియేషన్) కూడా నన్ను వదిలేశారు. నా కరెంటు బిల్లు కట్టడంతో పాటు నా ఆలనా పాలనా, పరిశుభ్రతా చూసే అసోసియేషన్ ఇప్పుడు అవేమీ పట్టించుకోవడంలేదు. విద్యుత్‌శాఖ వారు కరెంటు కట్ చేశారు. అప్పుడప్పుడూ నా బంధువులొచ్చి నా ముందు నిలబడి వచ్చేపోయే వాహనాలను నిలిపి తనిఖీ చేస్తుంటారు. మిగిలిన రోజుల్లో నా ముందే రోడ్డుపై వ్యాపారస్తులు దుకాణాలుపెట్టి పాలు, దోశలు, ఇడ్లీలు అమ్ముకుంటుంటారు. నా కళ్లెదురుగానే ఇక్కడ వాహనదారులు వన్‌వేలో వెళ్తుంటారు. నాముందే ఇక్కడ చాలామంది తమ ఇష్టారాజ్యాంగా రోడ్డుకి అడ్డంగా తమ వాహనాలను పార్క్ చేస్తుంటారు. నా పక్కనే ఉన్న రైలుపట్టాల వీధి రాత్రి 8 దాటితే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. కొన్నిసార్లు ఇక్కడ కొట్లాటలు, మర్డర్లు కూడా జరుగుతుంటాయి. ఇక మందుబాబుల ఆగడాల సంగతి చెప్పనక్కరలేదు.




## ఇప్పుడు నాది 5 కోట్ల ఖరీదైన స్థలం

నేనుండే స్థలం ఇప్పుడు అత్యంత ఖరీదై పోయింది. వ్యాపార సముదాయాల మధ్యలో ఉండడంతో స్థలం ధర అనూహ్యంగా పెరిగిపోయింది. ఇక్కడ అంకణం 15 లక్షల రూపాయలు పలుకుతోంది. అంటే నా 35 అంకణాలు సుమారు రూ.5 కోట్ల ధర పలుకుతుంది. ఇప్పటికే నా పక్కనున్న రైల్వేగేటు రోడ్డు స్థలాన్ని ఒకాయన దర్జాగా కబ్జాచేసి జీవితంలో స్థిరపడిపోయారు. నామీద కూడా ఎవరైనా ఆక్రమణదారుల కళ్ళు పడకముందే నాకు పూర్వవైభవం కల్పించాలని జిల్లా ఎస్.పి సారుతో పాటు పెద్దదొరని కూడా వేడుకుంటున్నాను. కావాలంటే క్రింది అంతస్తులో వ్యాపార సముదాయాన్ని నిర్మించి, పైఅంతస్తులో కంట్రోల్ రూమ్‌ని నిర్మిస్తే లే అవుట్‌కే కళ వస్తుంది. నన్ను పోషించడానికి నిధులు సమకూరుతాయి. ఇక్కడ దుకాణాలు కడతామంటే అడ్వాన్సుగా లక్షల రూపాయలు వసూలవుతాయి. జిల్లాలో ముగ్గురు రాజ్యసభ సభ్యులు, ఇద్దరు పార్లమెంటు సభ్యులు ఉన్నారు. మాగుంట లే అవుట్‌లో కోట్లకు పడగలెత్తిన వ్యాపారవేత్తలు ఉన్నారు, రాజకీయ నేతలు ఉన్నారు, నిర్మాణ సంస్థల సారధులు ఉన్నారు. అడ్వాన్సులు పోగా మిగిలిన మొత్తానికి పెద్దమనసుతో ఎవరు ముందుకొచ్చినా, వీళ్ళలో ఎవరు పూనుకున్నా నాకు మోక్షం వస్తుంది. అక్రమ పార్కింగులు, వన్‌వే ప్రయాణాలు, బైకుల రేసింగులు అదుపులోకి వస్తాయి. లే అవుట్‌లో జరిగే చీకటి కార్యక్రమాలకు తెరపడుతుంది. నేరాలు, ఘోరాలు, దౌర్జన్యాలు, దుర్మార్గాలు, దోపిడీలు, దొంగతనాలు తగ్గిపోతాయి. ఇవన్నీ జరక్కుండా చూసే బాధ్యత నాది.

నాకు మోక్షం ప్రసాదించండి, నేను ప్రజలకి రక్షణ కల్పిస్తాను.

అందరికీ ఇది నా విజ్ఞప్తి, విన్నపం, వేడుకోలు.

సదా ప్రజల సేవాభిలాషి

*మాగుంట లే అవుట్ పోలీసు "అవుట్" పోస్టు.*

లాయర్
ఏప్రిల్ 07, 2023

# ఆరోగ్యంపై అప్పుడున్నంత శ్రద్ధ ఇప్పుడేదీ?

కరోనా భయంకరమైనదే. కానీ ప్రపంచానికి ఒకరకంగా మంచే చేసిందేమో! దాని దెబ్బకి మనిషికి వ్యాధుల తీవ్రత, వైద్యం ఆవశ్యకత బాగా తెలిసొచ్చాయి. ఆ విషవ్యాధిని ఎదుర్కొనేందుకు ప్రపంచమంతా ఒక్కటైంది. ఎక్కడెక్కడి మందులో, ఎన్నెన్ని పరిశోధనలో, ఎన్ని రకాల ఔషధాలో దిగొచ్చాయి. టీకాలు కూడా వచ్చేసింది. ఆసుపత్రుల్లో వసతులు పెరిగాయి. ఆక్సిజన్ విలువ ఎంత గొప్పదో, ఎందరి ప్రాణాలను నిలబెట్టిందో చెప్పలేం. కోట్లాదిమందిని కాటేసి, లక్షలాదిమందిని పొట్టనబెట్టుకున్న ఇలాంటి విపత్తులు ఇంకా రకరకాల రూపాల్లో వస్తూనే ఉన్నాయి. ఎట్లనో ప్రపంచం కాస్తంత ఊపిరి తీసుకుంది కానీ, కరోనా మహమ్మారి వీరంగం మాత్రం ఇంకా తగ్గలేదు. కాలగతిన మరెన్ని వ్యాధులు ముంచుకొస్తాయో తెలియదు. అందుకు మనం సిద్ధంగా ఉన్నామా?.. అన్నది ఎవరికి వారు వేసుకోవాల్సిన ప్రశ్న. ఈ వ్యాధుల బాధలకు దూరంగా ఉండాలంటే ముందుగా ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని శాస్త్రవేత్తలు అనాదిగా చెప్తూనే ఉన్నారు. మనం పీల్చే గాలి, తాగే నీరు, తినే తిండి అన్నీ సక్రమంగా ఉండాలి. కలుషితాహారం, కల్తీ పదార్థాలు నిండివున్న నేటి సమాజంలో 'స్వచ్ఛ' అన్నమాటకు చోటెక్కడ?.. వాయుకాలుష్యం వల్ల మానవ శరీరంలోని అనేక అవయవాలు, ముఖ్యంగా ఊపిరితిత్తులు దెబ్బతినడం జరుగుతుందని వైద్యులు చెప్తున్నారు. అయినా నేటికీ ప్రపంచమంతా కలుషితమైన గాలినే పీల్చుకుని నానా బాధలు పడుతోందని, నాణ్యత లేని గాలిని పీల్చడం వల్ల ప్రజలకు రకరకాల ఇబ్బందులు వస్తున్నాయని, డబ్ల్యుహెచ్ఓ (ప్రపంచ ఆరోగ్య సంస్థ) ఆందోళన వ్యక్తం చేస్తోంది. అందువల్ల గాలి నాణ్యతను పెంచేందుకు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ఏ ఒక్కదేశమో కాదు, ప్రపంచవ్యాప్తంగా కృషి జరగాల్సి ఉంది. ఆరోగ్యమే మహాభాగ్యం. ఆరోగ్యం లేకుంటే ఎన్నుండి ఏం ప్రయోజనం? మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకోవడానికి సక్రమమైన ఆహారపుటలవాట్లు, క్రమబద్ధమైన జీవనం, యోగా, ధ్యానం వంటివి ఎంతో మంచిదని ఎందరో నిపుణులు పదేపదే చెప్తూనే ఉన్నా, వింటున్నవారే కానీ ఆచరించేవారు తక్కువ. రోజులు గడిచేకొద్దీ మళ్ళీ మనిషి యాంత్రికమైపోతున్నాడు. కరోనా నేర్పిన పాఠాలను గుణపాఠాలుగా తీసుకోవడం లేదు. మన ఆరోగ్యంతో పాటు ఈ భూమండలం కలుషితం కాకుండా ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలి. కాలుష్యభూతాన్ని తరిమికొట్టాలి. సకల మానవాళి ఆరోగ్యం కోసం నేలతల్లిని కాపాడుకోవాలి. సముద్రాలను కలుషితం కాకుండా చూసుకోవాలి. వాతావరణ సంక్షోభం మానవాళికి పెద్ద ముప్పు అన్నది గ్రహించాలి. ప్రపంచవ్యాప్తంగా మానవులంతా ఒక్కటై మునుపటి కంటే మెరుగైన ఆరోగ్యప్రపంచాన్ని నిర్మించుకోవాలి. కరోనా రోజుల్లో వైద్యరంగం విలువ ఆకాశమంత ఎత్తుకు పెరిగింది. కరోనా రాకాసి నుంచి ప్రాణాలు కాపాడుకోవడానికి ఎన్ని కష్టాలో!..దీంతో ఆసుపత్రుల అభివృద్ధి తప్పనిసరి అయింది. ప్రజల్లోనూ ఆరోగ్యంపట్ల ఆసక్తి బాగా పెరిగింది. రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవడం, పోషకాహారాల పట్ల, సమతుల ఆహారం పట్ల మక్కువ పెరిగింది. అయితే, కరోనా రోజుల్లో ఉన్నంత శ్రద్ధ ఇప్పుడు కనిపించడం లేదు. ఆకులు కాలాక చేతులు పట్టుకోవడం కంటే, ఏ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. అయితే, కరోనా మరణ మృదంగాన్ని చూశాం కనుక, గతంలో కన్నా ఆరోగ్యం పట్ల, వైద్యరంగం అభివృద్ధి పట్ల ప్రభుత్వాలు మరింత చొరవ తీసుకోవాలి. ఒక్క కరోనా అని కాదు, మనిషిని నాశనం చేయడానికి ఎన్నెన్నో రకాల జబ్బులు, ప్రాణాంతక వ్యాధులు పొంచి ఉండనే ఉన్నాయి. ముఖ్యంగా మనదేశంలో గుండెజబ్బులు, క్యాన్సర్ వంటివాటితో నేటికీ ఎందరో నానా యాతనలు పడుతూనే ఉన్నారు. ఎంతోమంది ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు కూడా. ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యానికి, ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. వెంటనే ఆ రంగాలకి బడ్జెట్‌లోనూ భారీ కేటాయింపులు జరగాలి. ప్రపంచవ్యాప్తంగా వైద్యరంగంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అనూహ్యంగా పెరిగిపోతున్న నేటి రోజుల్లో ఇంకా మనం ఎంతగా వెనుకబడి ఉంటున్నామో గుర్తించాలి. గ్రామస్థాయి నుంచి వైద్యసౌకర్యాలు భారీగా పెరగాలి. ఏదమైనా మన ఆరోగ్యం మనచేతుల్లోనే ఉందనే విషయాన్ని గమనించి, అందరూ సమిష్టిగా ప్రకృతిని కాపాడుకుంటూ..ఆరోగ్యప్రదాయకమైన పరిసరాలను అభివృద్ధి చేసుకోవాలి. తద్వారా 'ఆరోగ్య భారత్'ను సాకారం చేసుకోవాలి.

**(ఏప్రిల్ 7.. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం)**

# ఎండాకాలం అంటే... దొంగల కాలం

జిల్లాలో ఇటీవలి కాలంలో దొంగతనాలు పెరిగిపోతున్నాయి. గతంలో దొంగలు ఇళ్లకు కన్నం పెట్టి ఇంట్లోకి దూరి దొంగతనాలు చేసేవాళ్ళు అని పెద్దోళ్లు చెప్తుండగా విన్నాం. ఇప్పుడు కాలం మారింది కదా.. నేరుగా తాళాలు పగలగొట్టేసి దర్జాగా చోరీలు చేసేస్తున్నారు. అందువల్ల ఇళ్ళకు తాళాలు వేసి వెళ్ళేటప్పుడు, అన్నివిధాలుగా ముందు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. ఒంటరి మహిళలు, వృద్ధులు ఉండే ఇళ్ళను ఎంచుకుని దొంగలు చోరీలకు, దోపిడీలకు పాల్పడుతున్నారు. ఇల్లు బాడుక్కి కావాలని అడగడానికి వచ్చినట్లుగా వచ్చి, గబుక్కున తలుపులు వేసేసి కత్తి చూపించి దోపిడీలు చేస్తున్న సంఘటనలు ఇటీవల నెల్లూరు నగరంలో జరిగినట్లు వార్తలొచ్చాయి. చూడండి ఎంతగా బరితెగించిపోతున్నారో దొంగలు. కాబట్టి ఇళ్ళవద్దకు వచ్చేవారిని కూడా గమనించుకోవాలి. అందులోనూ ఇప్పుడు ఎండాకాలం.. అంటే దొంగల కాలం. సెగగాలులకు తట్టుకోలేక, చల్లగాలి కోసం రాత్రివేళల్లో ఆరుబయట పడుకుంటుంటారు. పల్లెటూళ్ళలో ఎక్కువ మందికి ఇదొక అలవాటు. దీంతో, అదే సందని దొంగలు ఇళ్ళల్లోకి దూరి తమ పని కానిచ్చేస్తుంటారు. కాబట్టి తస్మాత్! జాగ్రత్త. ఈ ఎండాకాలం పోయేదాకా ప్రజలు ఇంకా జాగ్రత్తగా ఉండాలి. దొంగల ఆట కట్టించేందుకు ఉపయోగపడే సీసీ కెమెరాలను ఇళ్లకు, దుకాణాలకు పెట్టుకుంటే ఇంకా మంచిది. అపరిచిత, అనుమానిత వ్యక్తుల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. పోలీసు ఉన్నతాధికారులు ఈ పరిస్థితులను సమీక్షించి, జిల్లాలో ఎక్కడా దొంగతనాలు, దోపిడీలు జరగకుండా పోలీసు గస్తీని బాగా పెంచడం అవసరం.

*ఎస్ శివానందకుమార్,* **ఆత్మకూరు.**




# మార్కెట్ రోడ్డు గబ్బు గబ్బు

నెల్లూరులోని ఏసీ మార్కెట్ పక్కనున్న రోడ్డు..అంటే మద్రాసు బస్టాండ్ నుంచి రెడ్‌క్రాస్‌కు వెళ్లే రోడ్డు పరమ గలీజుగా ఉంది. ఆ రోడ్డుమీద నడుస్తుంటే వాంతులొచ్చేంత మురుగుడు గబ్బు. నిత్యం ఎంతోమంది విద్యార్థులు, రోగులు, మార్కెట్‌కు వచ్చే ప్రజలు ఆ దారినే వెళ్తుంటారు. వానొచ్చినప్పుడైతే ఇక ఆ రోడ్డుమీదకి వెళ్ళక్కర్లేదు. కడుపులో పేగులు నోట్లోకొస్తాయి. అంత గబ్బుకొడుతోందా రోడ్డు. అదే మార్గంలో పెద్ద పెద్ద అధికారులు వాహనాల్లో వెళ్తుంటారు. కార్ల డోర్లు మూసేసి ఉంటాయి కాబట్టి, వాళ్ళకి ఆ దుర్వాసన రాదు. కానీ, సామాన్యజనం పడే అవస్తలు అన్నిన్ని కాదు. మార్కెట్ చుట్టుపక్కలంతా చెత్తాచెదారం పేరుకుపోయి ఉంటుంది. ఎప్పుడూ మురుగు పారుతూ ఉంటుందక్కడ. ఎప్పటికప్పుడు ఈ చెత్తను క్రమబద్ధంగా ఎత్తివేసే వ్యవస్థే లేకపోవడం విచారకరం. జనం రద్దీగా ఉండే ప్రాంతాలు ఇంత గబ్బుకొట్టి పోతున్నా పట్టించుకోకుంటే ఎలా?.. నగరం మరీ ఘోరంగా తయారైపోయింది. 'స్వచ్ఛ నెల్లూరు' అంటే ఇదేనా?.. జిల్లా ఉన్నతాధికారులైనా దయచేసి ఈ దుస్థితి గమనించాలి. ముందు ఆ రోడ్డును బాగుచేయించాలని ప్రార్థన.

*– కెఎస్ సుందర రామాచారి,* **నెల్లూరు.**

# చీటీల పేరుతో చీటింగ్




**మా** ఊళ్ళో ఒకామె ఉండేది. పేరు చిన్నమ్మ. చూసేందుకు గయ్యాళిలాగా ఉన్నా, ఆమె మనసు చాలా మంచిదని చెప్పేవాళ్ళు. ఊళ్ళో అందరూ ఆమెని భలే గౌరవంగా చూస్తుండేవారు. బోండాల అంగడి కాడ కనిపిస్తే, బోండాలిచ్చేవారు. టీ అంగడోళ్లు ఉచితంగా టీ ఇచ్చేవాళ్ళు. ఆమె వొద్దంటున్నా బలవంతంగా తినిపిచ్చేవారు, తాగిచ్చేవారు. ఆమె ఎక్కడ కనిపించినా అందరూ దండాలు దస్కాలు పెట్టేవాళ్ళు. నేను పేరుకి గుమాస్తాగా పెద్ద ఉద్యోగంలో ఉన్నా, ఎవరైనా ఆఫీసుకాడకి వచ్చినప్పుడు మాత్రమే దండాలు పెట్టేవాళ్ళు. చిన్నమ్మ వాళ్ళ పాలిట దేవతలా అందరి అభిమానం చూరగొంది. ఉన్నట్లుండి ఓ రోజు, ఆమె ఊరి నుంచి ఉడాయించేసిందని, జనాన్ని మోసం చేసేసిందని పెద్ద సంచలనం రేగింది. తీరా చూద్దును కదా... ఆమె జనం దగ్గర డబ్బులు బాగా లాగేసుకుని, లక్షల్లో పోగేసుకుని, అర్ధరాత్రి పూట మాయమైపోయింది. అప్పటిదాకా నాకసలు ఆమె గురించి పెద్దగా తెలియదు. చీటీలు కట్టించుకుని జనంతో లావాదేవీలు జరుపుతుండేది. జనానికి కుచ్చుటోపీ పెట్టి వెళ్ళిపోతుందని ఎవరూ ఊహించనే లేదు. నెలనెలా చీటీలు కట్టించుకుని, ఉన్నట్లుండి కనిపించకపోతే పరిస్థితేమిటి?..అని ఆమె అంతర్ధానమయ్యేదాకా ఎవరూ ఆలోచించనే లేదు. అవతల ఆమె ఎప్పుడు ఊళ్లోకి వస్తుందా అని అందరూ ఎదురుచూశారు. ఆమె వచ్చిందీ లేదు..కట్టుకున్న డబ్బు తిరిగి ఇచ్చిందీ లేదు. వాళ్ళంతా ఆమె వద్ద చీటీలు కట్టినోళ్ళన్న మాట. అదీ సంగతి. మాయమాటల్లో ఊబిలోకి దింపి, మొదటి రెండు నెలలు డబ్బులు కట్టించుకున్న తర్వాత ఇకనుంచీ వాళ్ళే వెతుక్కుంటూ వచ్చి కడతారులే అని ధీమాగా ఉంటారు చీటీలోళ్ళు. నమ్మినోళ్ళని మోసం చేయడం తేలిక. కష్టపడి రూపాయి రూపాయి కూడబెట్టుకుని, దాన్నంతా మూటగట్టి చీటీలు వేస్తుంటారు జిల్లాలో చాలామంది. ముఖ్యంగా ఇళ్ళలో ఉండే మహిళలకు వీటిమీద పెద్ద మోజు. భర్తకి కూడా తెలియకుండా సైగ్గా చీటీలకి డబ్బులు కడుతుంటారు. అవసరానికి ఆ డబ్బు ఆదుకుంటుందిలే అనుకుంటారు. తీరా, చీటీలు కట్టించుకున్నోళ్ళు కుచ్చుటోపీ పెట్టేదాకా తెలియదు..మోసపోయామని. క్రమేణా ఈ అసాంఘిక, అనైతిక వ్యాపారం అన్ని ఊళ్లకీ, నగరాలకి కూడా పాకిపోయింది. సమాజంలో ఎంతో గౌరవప్రదంగా ఉండేవాళ్ళు కూడా చీటీలు వేస్తుంటారు. మొదట్లో బాగానే ఉంటుంది, ముందుగా

## సమస్యలతో 'రణం'

తమ వాటాను పాడుకునే వెసులుబాటు ఉండడంతో, మహిళలు అనేకమంది చీటీలు కట్టేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఏదో వేన్నీళ్ళకి చన్నీళ్లు తోడన్నట్లుగా ఉంటుందని, పోపుల డబ్బాలో డబ్బు జాగ్రత్తగా దాచుకుని 'ఇన్ని నెలల చీటీ' అని ఉంటుంది కదా..దానికి కట్టేస్తారు డబ్బంతా ఎత్తుకుపోయి. ఆ సంగతి ఏదో ఒకరోజు తెలియకపోతుందా?...ఇంట్లో భర్తకి తెలిస్తే, ఇంక గొడవలు ప్రారంభం. అయినా, నేనేమన్నా నెత్తినేసుకుపోదామని కట్టానా..అంతా ఇంటికే కదా!..అని మళ్ళీ నిష్ఠూరమొకటి. చీటీల వ్యాపారం చీటింగని, డబ్బులు కట్టి మోసపోవద్దని పదేపదే అధికారులు, పోలీసులు హెచ్చరిస్తూనే ఉన్నా, ఎవరు వింటున్నారు?..

### నమ్మించి నట్టేట ముంచుతారు!

మొన్నటికి మొన్న నెల్లూరు హరనాథపురంలో ఓ చీటీల వ్యాపారి 60లక్షల దాకా కట్టించుకుని జనానికి కుచ్చు టోపీ పెట్టినట్లు పేపర్లలో వార్తలొచ్చాయి. నమ్మకంగా డబ్బు కట్టించుకుని, ఆ తర్వాత జంప్ అయిపోవడం తరచూ జరుగుతుండేదే. మా ఊళ్ళో చీటీల చిన్నమ్మ లాగా, భలే మర్యాదస్తుల్లా కనిపించి, చీటీలు కట్టించుకుని, డబ్బులు ఇస్తూ తీసుకుంటూ జనాన్ని నమ్మించి మాయమైపోయినోళ్లు లక్షాబోలెడు మంది. అయినా, ఇప్పటికీ నెల్లూరు నగరంలోనూ, జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని ఊళ్ళలోనూ సైగ్గా ఈ చీటీల మోసపు వ్యాపారం జరుగుతూనే ఉంది. లోలోపలే ఈ రొటేషన్ వ్యాపారం లక్షల్లో కాదు, కోట్ల కోటలు కూడా దాటి వెళ్ళిపోయింది. ప్రతినెలా భలే కచ్చితంగా డబ్బులు కట్టించుకుంటూ, చీటీపాట పాడుకునేవారికి ఠంచనుగా డబ్బులిస్తూ నమ్మిస్తారు. ఆ తర్వాత ఉన్నట్లుండి బిచాణా ఎత్తేస్తారు. ఇలాంటి మోసాలకు ఎవరూ గురికాకండి అని ఇప్పుడు కాదు..నా చిన్నప్పటి నుంచి అధికారులు చెప్తూనే ఉన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే, ఆ మోసపు వ్యాపారులపై పోలీసులు కేసులు కడ్తూనే ఉంటారు. కానీ, ఎంత కాలమిలా మోసపోతాం?..మన డబ్బు ఎక్కడకీ పోదులే..వాళ్లు మంచి నమ్మకస్తులు, అవసరానికి ఆ డబ్బు పనికొస్తుందని అనేక మంది చీటీలు కట్టేస్తుండడం అలవాటైపోయింది. అలా నమ్మేవారినే చీటీలోళ్లు కూడా ఎంచుకుంటారు. అమాయకులు అది చీటింగ్ అని కలదెలుసుకునేసరికి, ఉన్న డబ్బంతా హుష్‌కాకీ అయిపోతుంది. ఆ డబ్బు రాబట్టుకోవడానికి ఎన్ని తిప్పలో చెప్పలేం. చీటీలకి డబ్బు కట్టి మోసపోయాం అని బంధుమిత్రులకో, లేదా పోలీసులకో చెప్పుకోవడానికి పెద్ద నామూషీ కనుక, చాలామంది మోసపోయినా అంతా మన కర్మ అని గమ్మునుంటారు. ఆ బలహీనతే చీటీలోళ్ళకి పెద్ద వరం.

అయినా..డబ్బు పొదుపు చేసుకోవాలనుకుంటే ప్రభుత్వపరంగా, బ్యాంకుల పరంగా ఎన్నో మంచి మార్గాలున్నాయి. వాటినన్నీ వొదిలేసి, కష్టపడి సంపాదించుకున్న డబ్బు ఊళ్ళోళ్లకి తగలెయ్యడం దేనికి?.. కర్మ కాకపోతే. చెప్పుకుంటే ఒక వేదన, చెప్పకుంటే ఇంకో యాతన. అమ్మలారా!..అయ్యలారా!.. ఇకనైనా వినండి. చీటీలకి డబ్బు కట్టి వృధాగా మోసపోకండి. అయినా, మన చేతిలో ఉన్న డబ్బు వాళ్లకి కట్టి, వాళ్ళ చుట్టూ తిరిగి మోసపోవడం కన్నా, ముందుజాగ్రత్తతో అలాంటి వాటికి దూరంగా ఉండడం మంచిదనే విషయం ఒకరు చెప్పాల్నా. ఆ మాత్రం మంచీ చెడ్డా తెలుసుకోకపోతే ఎలా?..

**- సంచారి**

# 'నుడా' బతికుందా?

## అక్రమ లేఅవుట్లను పట్టించుకోరా?

**- మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి ధ్వజం**



నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ 'నుడా' బతికుందా?.. అనుమతులు లేకుండానే లేఅవుట్లు వేస్తున్నా పట్టించుకోరా అంటూ టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి ధ్వజమెత్తారు. నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో ఇటీవల జరిగిన సమన్వయ కమిటీ సమావేశం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అక్రమార్కులు అక్రమ లేఅవుట్లు వేస్తుంటే, ప్రజల సొత్తును కోట్లాది రూపాయలు జీతాలుగా తీసుకుంటున్న అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అల్లీపురంలో మా ఇంటి ఎదురుగా పంట కాలువలు, కాలువ పోరంబోకులను ఆక్రమించి అనుమతులు లేకుండా లేఅవుట్ వేస్తుంటే ఈ అధికారులు ఏం చేశారు?.. ఇదే విధంగా నుడా పరిధిలో అన్ని చోట్ల అనుమతులు లేకుండా లేఅవుట్లు వేసి నిబంధనలకు తూట్లు పొడుస్తుంటే సంబంధిత అధికారులేం చేస్తున్నారు?..ఎకరాలకు ఎకరాలు లేఅవుట్లు వేస్తూ కనీసం పిల్లలు ఆడుకోవడంతో పాటు ప్రజావయోగ అవసరాలకు సెంటు భూమి కూడా వదిలిపెట్టకపోవడం దుర్మార్గం కాదా?...అంటూ ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు. 25, 30 అడుగుల వెడల్పుతోనే రోడ్లు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ప్రజలు ఇక జీవితాంతం ఆ ఇరుకు రోడ్లలోనే బతకాలా?..అని ఆయన అన్నారు. ఇరిగేషన్ శాఖలో కోట్లాది రూపాయల అక్రమాలు జరుగుతుంటే ఐఏఎస్ అధికారులు చేతులు కట్టుకుని కూర్చోవడం బాధాకరమని, ప్రభుత్వ భూముల్లో సిలికా దోపిడీ యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకోరా?..అంటూ ఆయన ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో నుడాతో పాటు.. ఇరిగేషన్, మైనింగ్ శాఖలను మూతవేసి కొందరు అధికారులు అవినీతిలో మునిగితేలుతున్నారని, గూడూరు డివిజన్‌లో సిలికా అక్రమ మైనింగ్‌కు అంతులేకుండా పోయిందని ఆయన ఆరోపించారు. తమ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పర్యటన ముగియగానే, ఈ అక్రమ లేఅవుట్లు, భూఆక్రమణలు, సిలికా దోపిడీ, ఇరిగేషన్ శాఖలోని కుంభకోణాలపై అంశాల వారీగా పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

### ఏప్రిల్ 7న చంద్రబాబు వస్తున్నారు :

టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ఏప్రిల్ 7న నెల్లూరుకు వస్తున్నారని, 5 పార్లమెంటు నియోజకవర్గాల నాయకులతో భేటీ కాబోతున్నారని సోమిరెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. నెల్లూరులో ఎన్టీఆర్‌నగర్ వద్ద వేణుగోపాలస్వామి కళాశాల మైదానంలో ఆ సమావేశం జరగబోతోందన్నారు. కావలి నుంచి వెంకటగిరి వరకు వేలాదిగా ఉన్న అక్రమ లేఅవుట్లపై పోరాటం చేయాలని సమన్వయ కమిటీ సమావేశంలో నిర్ణయించామని తెలిపారు. సమన్వయ కమిటీ సమావేశం అనంతరం ఎస్వీజీఎస్ కళాశాల మైదానంలో చంద్రబాబునాయుడి పర్యటన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. నాయకులు బీద రవిచంద్రయాదవ్, జనార్దన్‌రెడ్డి, షేక్ అబ్దుల్ అజీజ్, నరసింహయాదవ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, డాక్టర్ జెడ్.శివప్రసాద్, పాశం సునీల్ కుమార్, నెలవల సుబ్రహ్మణ్యం, చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, గూటూరు మురళీకన్నబాబు, తాళ్లపాక అనూరాధ, వేనాటి సతీష్‌రెడ్డి, మాలేపాటి సుబ్బానాయుడు, బొమ్మి సురేంద్ర, వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డి, జెన్ని రమణయ్య, చెంచలబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 4.25 లక్షల ఎకరాలకు సాగునీరు

## ○ ఐఏబి సమావేశంలో రెండోపంటకు నీటి కేటాయింపు



*ఒకవైపు అకాల వర్షాలు, మరోవైపు కోతకు వచ్చిన ధాన్యాన్ని సకాలంలో అమ్ముకోలేక అవస్థలు పడుతున్న రైతాంగం.. ఈ నేపథ్యంలో ఇటీవల నెల్లూరులో జరిగిన సాగునీటి సలహా మండలి (ఐఏబి) సమావేశం ఆసక్తికరంగా సాగింది. జిల్లాలో రెండో పంట రబీకి సంబంధించి సోమశిల, కండలేరు జలాశయాల పరిధిలో 4.25 లక్షల ఎకరాల ఆయకట్టుకు మొత్తం 46 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం తీర్మానించింది. అయితే, రెండోపంటకు సాగునీరిచ్చినా అనేకచోట్ల పంట కాలువల్లో పూడిక తీయకపోవడం వల్ల కేటాయించిన నీరంతా చివరి ఆయకట్టు దాకా వస్తాయా అన్నది సందేహమే.*

నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, వ్యవసాయమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మెన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబు తదితరుల సమక్షంలో సాగునీటి సలహామండలి సమావేశం నిర్వహించారు. సోమశిల, కండలేరు జలాశయాల్లో నీళ్లు పుష్కలంగా ఉండడంతో సాగునీటికి కొరత లేకుండా రెండోపంటకు రైతులు ఇబ్బంది పడకుండా సాగునీటిని కేటాయించారు.

ఇటీవల కురిసిన అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టామని, పూర్తిస్థాయిలో నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపించామని, త్వరలోనే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని మంత్రి కాకాణి భరోసా ఇచ్చారు. రైతులు కేవలం వరి కాకుండా, తక్కువ నీటితో అధికదిగుబడులు వచ్చే పంటల సాగుపై కూడా దృష్టి సారించాలని, చిరుధాన్యాలు, పత్తి, వేరుశనగ వంటి పంటలు రైతులకు ఎంతో లాభదాయకమని ఆయన చెప్పారు.

రైతులందరూ తక్కువ నీటి వినియోగంతో పండే చిరుధాన్యాలకు ప్రాధాన్యత నివ్వాలని, ఈ ఏడాది చిరుధాన్యాల సంవత్సరంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం శుభపరిణామమని, రైతులందరూ చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కోరారు. కందుకూరు శాసన సభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ, రాళ్లపాడు ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నీరు సరఫరా కావడం లేదని, ఈసారైనా పూర్తిస్థాయిలో అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ రెండో పంటకు విత్తనాలు, టార్పాలిన్ పట్టలను సబ్సిడీపై అందజేయాలని, పంట కాలువలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు వాకాటి నారాయణరెడ్డి, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, జేసీ కూర్మనాథ్, తెలుగు గంగ ప్రాజెక్ట్ చీఫ్‌ఇంజనీర్ హరినారాయణరెడ్డి పాల్గొన్నారు. తొలుత, వ్యవసాయశాఖ రూపొందించిన 'నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక 2023-24' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం, చిరుధాన్యాల విత్తనాలను మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా రైతులకు అందజేశారు.

## శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానం ఇఓగా..

# వెంకట శ్రీనివాసులురెడ్డి



నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్‌గా అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి నియమితులయ్యారు. వెంకటగిరిలోని శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఉన్న శ్రీనివాసులు రెడ్డికి శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి గుడి ఇ.ఓ బాధ్యతలను దేవాదాయ శాఖ అదనంగా అప్పజెప్పింది.



మార్చి 31వ తేదీ ఇ.ఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసులురెడ్డి

గతంలో జిల్లాలోని ప్రముఖ దేవస్థానాలైన జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి దేవస్థానం, తూర్పుకనుపూరులోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం, నెల్లూరు సమీపంలోని నరసింహకొండపై వెలసిన శ్రీ వేదగిరి లక్ష్మీనృసింహస్వామి దేవాలయం, నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానాల్లో దీర్ఘకాలంగా కార్యనిర్వహణాధికారిగా పనిచేసిన అనుభవజ్ఞులు శ్రీనివాసులురెడ్డి.

## సైబర్ నేరాలపై..

# డికెడబ్ల్యులో అవగాహన సదస్సు



సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్ అంశాలపై ఇటీవల నెల్లూరులోని డికెడబ్ల్యు కళాశాలలో అవగాహన సదస్సు జరిగింది. యువత వీటికి దూరంగా ఉండాలని, ఎవరూ వాటి జోలికిపోవద్దని అధికారులు తెలిపారు. జిల్లా యువజన సంక్షేమశాఖ-సెట్నెల్ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించారు. నెల్లూరులోని సైబర్ విశ్లేషణ విభాగం ఎస్ఐ సురేష్‌బాబు మాట్లాడుతూ, సైబర్ నేరాల వల్ల మోసపోయేవారిలో 70శాతం మంది వరకు మహిళలు ఉన్నారని, మహిళలు తమకు సంబంధించిన అన్ని పాస్‌వర్డ్‌లను ఎవరికీ ఇవ్వకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సెట్నెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.పుల్లయ్య, డికెడబ్ల్యు కామర్స్ హెచ్ఓడి లక్ష్మీప్రసన్న, అధ్యాపకురాలు సృజన, కామర్స్ ఇన్‌చార్జి విభాగాధిపతి విజయభాస్కర్, సెట్నెల్ మేనేజర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ విజయకుమార్ హత్య కేసులో..

# కోర్టు తీర్పు చరిత్రాత్మకం

**- ట్రస్ట్ ఛైర్మెన్ గోపాల్‌రెడ్డి**



సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ విజయకుమార్ హత్యకేసులో ఇటీవల న్యాయస్థానం ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని డాక్టర్ విజయకుమార్ మెమోరియల్ నెల్లూరు హాస్పిటల్ ట్రస్టు ఛైర్మెన్ గోపాలరెడ్డి కొనియాడారు. ఈనెల 2న స్థానిక నెల్లూరు హాస్పిటల్‌లో డాక్టర్ విజయకుమార్ స్నేహితులు, ప్రజాసంఘాల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు ఏడున్నరేళ్ల క్రితం డాక్టర్ విజయకుమార్ హత్య జరిగిందని, ఇంట్లో నిద్రపోతున్న విజయకుమార్‌ను ఆయన భార్య, కుమారుడు, కిరాయి హంతకులతో కలిసి, నిందితులు పథకం ప్రకారం హత్యచేసిన సంఘటనకు సంబంధించి నిందితులకు యావజ్జీవ కారాగారశిక్ష విధిస్తూ ఇటీవల కోర్టు తీర్పు చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. విజయకుమార్ మిత్రుడు, న్యాయవాది శేషారెడ్డి దానిని హత్యగా భావించి పోలీసులకు రిపోర్టు ఇచ్చారని, విచారణలో చివరకది హత్యగానే రుజువైందన్నారు. కోర్టుకు సరైన ఆధారాలు సమర్పించడంలో మిత్రులు, ప్రజాసంఘాలు చేసిన కృషిని ఆయన అభినందిస్తూ, అందుకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ విజయకుమార్ మాతృమూర్తి జయలక్ష్మి, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, న్యాయవాది అబ్బాయిరెడ్డి, గాలి శ్రీనివాసులు, నూనె నారాయణ, మాల్యాద్రి, చక్రపాణి పాల్గొన్నారు.

## వైసిపి నుంచి మన్నెమాల సస్పెండ్

ఇటీవల దాకా కావలి ఎమ్మెల్యే వెంట నీడగా ఉంటూ, కావలి రాజకీయాల్లో చక్రం తిప్పుతున్న మన్నెమాల సుకుమార్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఈనెల 3న పేర్కొంది. మన్నెమాల పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఆయన్ను సస్పెండ్ చేసినట్లు సమాచారం.

# నెల్లూరు కబుర్లు

## క్యాన్సర్ ఆసుపత్రికి రూ.5 లక్షల విరాళం

### ○ దాతలను అభినందించిన కలెక్టర్



సమాజసేవకు తోడ్పడుతున్న ఇండియన్ రెడ్ క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి 5 లక్షల రూపాయల విరాళం అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు దాతలను అభినందించారు. నెల్లూరు నివాసి పావులూరి మాలకొండయ్య-మహాలక్ష్మి దంపతులు ఇటీవల కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వారి కుమారులు దివంగత పావులూరి యుగంధర్ జ్ఞాపకార్థం 5 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నెల్లూరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సమాజ సేవలో దేశంలోనే ప్రత్యేక స్థానం దక్కించుకుందన్నారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు యాలమూరి రంగయ్యనాయుడు, మెడికల్ చీఫ్ డాక్టర్ లక్ష్మి, శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ నాగేశ్వరరావు, ఏఓ జుబేదా, సామాజిక కార్యకర్త కె.సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి.. పరీక్షలు ప్రారంభం

పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 3 నుంచి 18వ తేది వరకు పరీక్షలు జరుగనున్నాయి. అందుకోసం జిల్లా అధికారులు జిల్లా వ్యాప్తంగా 172 పరీక్షాకేంద్రాలను ఏర్పాటుచేసి, పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. 27,291 మంది రెగ్యులర్ విద్యార్థులు, మరో 2100 మంది ప్రైవేట్ విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నట్లు అధికారులు చెప్పారు. పరీక్షలను పటిష్టంగా నిర్వహించేందుకు 1800 మంది ఇన్విజిలేటర్లను, 172 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లను, 9 ఫ్లయింగ్‌స్క్వాడ్‌లను ఏర్పాటుచేశారు. సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలను కూడా పెట్టారు. పరీక్షలు గతంలో ఎప్పుడూ లేనివిధంగా రోజు మార్చి రోజు నిర్ణీత రోజుల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తున్నారు.



## టెర్రాలాజిక్ సంస్థల దాతృత్వం

కోమిట్ల రెనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నడిచే సాఫ్ట్‌వేర్ కంపెనీ 'టెర్రాలాజిక్' దాతృత్వంలో సైతం ముందుంది. ప్రజాహాస్పిటల్ డా॥ రామచంద్రారెడ్డి వైద్యశాలకు మూడు లక్షల రూపాయల విలువచేసే డెంటల్ ఛైర్‌ను రెనిల్‌కుమార్‌రెడ్డి తన తండ్రి కోమిట్ల సత్యనారాయణరెడ్డి చేతులమీదుగా అందజేశారు. తమ సంస్థ ద్వారా రామచంద్రారెడ్డి లాంటి ప్రజావైద్యశాలకు డెంటల్ ఛైర్ అందించే భాగ్యం కల్గినందుకు చాలా ఆనందంగా ఉందని ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డా॥ రాజేశ్వరరావు, హాస్పిటల్ డెంటల్ డాక్టర్ ఎస్.పద్మావతి, డాక్టర్ అనీశ్ తఫీవ్, డాక్టర్ సుబ్రహ్మణ్యం మరియు ఆడిటర్ చిన్ని శ్రావణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 9న..
## టౌన్‌హాలు 108వ సంస్థాపక దినోత్సవం

నెల్లూరు నగరంలో ప్రసిద్ధిగాంచిన పురమందిరం (టౌన్‌హాలు) స్థాపించి 108 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని టౌన్‌హాలు 108వ సంస్థాపక దినోత్సవాన్ని ఏప్రిల్ 9వ తేది, ఆదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నామని, రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, అందరూ ఆహ్వానితులేనని టౌన్‌హాలు ట్రస్టుబోర్డు కార్యదర్శి జెఎస్ రెడ్డి ఈనెల 5న ఒక ప్రకటనలో తెలిపారు.

## కొత్త పరిచయాలతో జాగ్రత్త

కొత్త పరిచయాలతో జాగ్రత్తగా ఉండాలని, ఇటీవల ఆన్‌లైన్‌లో కొత్త స్నేహితులమంటూ కొందరు మోసాలకు పాల్పడుతున్నారని, ముఖ్యంగా ప్రేమ పేరుతో వంచించడం, వ్యక్తిగత సమాచారాన్ని తెలుసుకుని సోషల్‌మీడియాలో పెడతామని బెదిరించడం వంటి మోసపు పనులు చేస్తున్నారని జిల్లా ఎస్పీ సిహెచ్ విజయరావు ప్రజలను హెచ్చరించారు.



## జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌ను కలుసుకున్న కలెక్టర్

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్ ఇటీవల ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ 9వ జిల్లా సదస్సులో పాల్గొనేందుకు నెల్లూరు నగరానికి వచ్చిన సందర్భంగా ఆయన్ను జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

## అక్రిడిటేషన్ కార్డులు రెన్యువల్ చేయండి

### ఏపియుడబ్ల్యుజె నాయకుల వినతి



కొత్త అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చేవరకు, ఇప్పుడు ఉన్న కార్డులను రెన్యువల్ చేయాలని ఏపీయూడబ్ల్యూజె నాయకులు కోరారు. ఈనెల 4న జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌ను కలిసి ఆ మేరకు వినతి పత్రం సమర్పించారు. మార్చి 31 నాటికి అక్రిడేషన్ల గడువు ముగియడంతో ప్రభుత్వం అక్రిడిటేషన్ల కోసం జీవో జారీ చేసి ప్రక్రియ ప్రారంభించకపోవడం శోచనీయమని, కొత్త కార్డులు వచ్చేవరకు కనీసం ఉన్న వాటిని రెన్యువల్ కూడా చేయకపోవడం బాధాకరమన్నారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని, అక్రిడిటేషన్ కమిటీలో యూనియన్లకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ఏపీయూడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి అనుమల జయప్రకాష్, జిల్లా అధ్యక్షులు వి.వెంకటేశ్వర్లు, సామ్నా జిల్లా కార్యదర్శి జి.హనుక్, సీనియర్ జర్నలిస్టు-విశాలాంధ్ర బ్యూరో కె.దయాశంకర్, వేలూరి సుబ్బారావు, గోపీనాథ్, అరవ సుధాకర్, సుహానా, ఎస్ కే నజీర్, ప్రతాప్ పాల్గొన్నారు.

## 'తంగిరాల మహాభారతం' 49వ భాగం

ద్రౌపది స్వయంవరానికి వచ్చిన రాజులు, ఒక బ్రాహ్మణుడు మత్స్యయంత్రాన్ని కొట్టాడని నిరుత్సాహపడి ద్రుపదుని మీదకు వెళ్ళినప్పుడు, ద్రుపదుడు బ్రాహ్మణుల వెనక్కు దాక్కున్నప్పుడు, బ్రాహ్మణులు బాసటగా నిలుస్తారు. అప్పుడు అర్జునుడు వాళ్ళను వారించి, తానొక్కడే వాళ్ళమీద యుద్ధానికివెళ్లి వాళ్ళను తరిమి కొడతాడు. కానీ, కర్ణుడు నిలబడి అతనితో యుద్ధం చేస్తాడు గాని, అర్జునుడు ఎవరో హరుడని, ఇంద్రుడని, విజయుడని తలచి, విరమించుకుంటాడు. అలాగే శల్యుడు భీమునితో తలపడి నిలవలేక పారిపోతాడు. అర్జునుడు, భీముని పరాక్రమం చూసి శ్రీకృష్ణుడు గుర్తుపట్టి బలరామునితో చెపుతాడు. బలరాముడు ఎంతో సంతోషిస్తాడు. అప్పుడు శ్రీకృష్ణుడు మహారాజులకి అర్జునుడు తన అస్త్రవిద్యా పాటవంతో మత్స్యయంత్రాన్ని




కొట్టి ద్రౌపదిని గెలుచుకున్నాడు, అతని మీద దండెత్తటం న్యాయం కాదని నచ్చచెపుతాడు.

అక్కడ కుమ్మరి ఇంట్లో కుంతి, పాండవులు ఎప్పటికీ రాకపోయేటప్పటికి భయపడుతుంది.. కౌరవులు ఏమైనా అపకారం తలపెట్టారేమోనని. అర్జునుడు, భీముడు ద్రౌపదిని వెంటబెట్టుకుని ఇంటికి వస్తారు. అర్జునుడు ద్రౌపదిని బయట నించోబెట్టి అమ్మతో భిక్ష తెచ్చానని చెప్పినప్పుడు, అందరూ పంచుకోమని చెపుతుంది. ఆ తర్వాత ద్రౌపదిని చూసి ఎంతో బాధపడుతుంది. అది సమంజసం కాదని 5 గురు ద్రౌపదిని ఎలా పెళ్లిచేసుకుంటారని ధర్మరాజుని అడుగుతుంది. కృష్ణ ద్వైపాయనుని ఆదేశం ప్రకారం తామందరం ద్రౌపదిని పెళ్ళిచేకుంటామని చెపుతాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam
@YouTubeలో చూడగలరు.






## జర్నలిస్టుల గృహనిర్మాణ సంఘానికి ఎన్నికలు



ది నెల్లూరు జర్నలిస్టుల పరస్పర సహాయక సహకార గృహనిర్మాణ సంఘం లిమిటెడ్‌కు నూతన కార్యవర్గ కమిటీ ఏర్పాటు కోసం ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ పత్రాలను ఈనెల 2న స్వీకరించారు. నెల్లూరులోని ఎన్జీఓ హోంలో జరిగిన ఈ కార్యక్రమంలో 14 మంది నామినేషన్లు వేశారు. అనంతరం పరిశీలనలో నిలిచిన 12 మంది అభ్యర్థులకు పోటీగా మరో ప్యానల్ లేకపోవడంతో, వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లుగా ఎన్నికల అధికారి ప్రకటించారు. దీంతో నూతన కార్యవర్గ కమిటీ ఏర్పాటైనట్లయింది. అధ్యక్షునిగా వల్లూరు ప్రసాద్‌కుమార్, కార్యదర్శిగా గట్టుపల్లి శివకుమార్, ఉపాధ్యక్షునిగా కుమార్ (దేవ), డైరెక్టర్లుగా వేల్పుల శేషాచలపతి, ఉడతా రామకృష్ణ, కొండా సుబ్రహ్మణ్యం, కేశవులురెడ్డి, శాకమూరి శ్రీనివాసులు, ఏ.శివరామకృష్ణ, పాశం నరసింహారావు, ఎస్.వెంకటేశ్వరరావు, జమీర్‌లు ఏకగ్రీవమయ్యారు. ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది ఎం.సుందరయ్య వారిచే నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్నికల అధికారికి సహాయకులుగా కెసి హర్షవర్ధన్‌రెడ్డి, ఎం.హరీష్ వ్యవహరించారు.

## తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని సంరక్షించాలి

తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు వైద్యసిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పెంచలయ్య చెప్పారు. ఈనెల 3న నెల్లూరులోని వైద్యశాఖ కార్యాలయంలో ఆయన కావలి, ఆత్మకూరు, నెల్లూరు నగరంలోని ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులతో సమావేశమయ్యారు. గర్భిణులకు బీపీ, షుగర్, రక్తశాతం తదితర పరీక్షలను క్రమం తప్పకుండా చేయిస్తుండాలన్నారు. డెప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ త్రిజిత, డాక్టర్లు హరిశ్చంద్ర సతీష్, వెంటకరమణ, సునీల్, డిపిఓ రమేష్, డెమో అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో మరో ఆవిష్కరణ



# 'ఇసుజు' మొదటి 'మూవర్' ప్రారంభం

శ్రీసిటీలోని 'ఇసుజు మోటార్స్ ఇండియా' ప్లాంట్‌లో తయారైన మొదటి 'మూవర్' (ఎం.ఓ.ఓ.డబ్ల్యూ.ఆర్) పథకం క్రింద రూపొందించిన ఎగుమతి వాహనాన్ని ఈనెల 4న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఇసుజు మోటార్స్ ఇండియా (ఐఎంఐ) మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ మిట్టల్, డెప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ కిషిమోటో సమక్షంలో కేంద్ర కస్టమ్స్ అదనపు కమిషనర్ సాధు నరసింహారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఎగుమతి వాహనాలు తయారయ్యే 'మూవర్' గోదామును ఆవిష్కరించారు. ఇసుజుకు శుభాకాంక్షలు తెలిపిన నరసింహారెడ్డి, మరో మైలురాయిని అధిగమించినందుకు ఇసుజు బృందానికి ధన్యవాదాలు తెలిపారు. మూవర్ పథకం గురించి వివరిస్తూ, తయారీసంస్థల ప్రయోజనాల కోసం దిగుమతి చేసుకున్న వస్తువులపై కస్టమ్స్ సుంకాలను తొలగిస్తూ భారత ప్రభుత్వ పరోక్ష పన్నులు, కస్టమ్స్ సిబిఐసి శాఖ ఈ పథకాన్ని ప్రారంభించిందని ఆయన చెప్పారు. తయారీ రంగంలో పోటీని అధిగమించడం, ఆకర్షణీయమైన పెట్టుబడి గమ్యస్థానంగా భారతదేశాన్ని మార్చడం ఈ పథకం లక్ష్యంగా పేర్కొన్నారు. ఇసుజు బృందాన్ని అభినందించిన డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఇసుజు ఇండియా పరిశ్రమ వేగవంతమైన అభివృద్ధి పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఐఎంఐ తన మొట్టమొదటి కార్ల తయారీ ప్లాంట్‌ను శ్రీసిటీలో ప్రారంభించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. 2016లో ప్లాంట్ స్థాపన మొదలై, పలు మైలురాళ్ళను అధిగమించిందని చెప్పారు. ఎగుమతులు నిర్వహించే ఇసుజు మోటార్స్ ఇండియా, ఐఎంఐ వంటి భారీ పరిశ్రమలకు 'మూవర్' పథకం వలన ఎంతో ప్రయోజనం చేకూరుతుందని రాజేష్ మిట్టల్ చెప్పారు. పథకం అమలు దశలో అద్భుతమద్దతు, ప్రోత్సాహం అందించిన నరసింహారెడ్డికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్లాంట్ ఆవరణలో స్టోరేజ్ ప్రాంతంతో పాటు 'మూవర్' గిడ్డంగిని కలిగి ఉన్న భారీ పరిశ్రమలలో ఐఎంఐ ఒకటి అని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అతి తక్కువ వ్యవధిలో 'మూవర్' కార్యకలాపాలకు అనుమతి దక్కడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తమ సంస్థ ఎదుగుదలకు అపూర్వ సహకారం అందించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఐఎంఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ కిషిమోటో కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీ ప్రసన్న వేంకటేశ్వరునికి.. రవీంద్ర సన్నారెడ్డి పూజలు



శ్రీసిటీ ఆరూరు నర్సరీ వద్ద ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 4న విష్ణు సహస్ర నామ పారాయణం పూజను వైభవంగా నిర్వహించారు. ఆ ప్రాంత ప్రజలు, ఉద్యోగుల క్షేమంతో పాటు శ్రీసిటీ మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షతో తలపెట్టిన ఈ పూజ నాలుగు రోజుల పాటు జరుగనుంది. మొదటి రోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, ప్రధాన కలశ స్థాపన, శ్రీవెంకటేశ్వర అష్టోత్తరం, అనంతరం విష్ణు సహస్ర నామ పారాయణ పూజలాచరించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డితో పాటు పలువురు శ్రీసిటీ ఉద్యోగులు, పరిసర గ్రామాల ప్రజలు పూజల్లో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ప్రభుత్వ ఉన్నతాధికారులతో.. శ్రీసిటీ ప్రతినిధులు

శ్రీసిటీ జపనీస్ ఇండస్ట్రీస్ మరియు జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జెట్రో) సీనియర్ ప్రతినిధులు ఈనెల 3న ఏపీ ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్, ఏపీఐఐసీ వైస్‌చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్, ఏపీఈడీబి సీఈఓ డాక్టర్ సృజన గుమ్మల్లా, దీనికి అధ్యక్షత వహించగ, జపాన్ కాన్సుల్ జనరల్ మసయుకి టాగాచే సహ అధ్యక్షత వహించారు. ఏపీఈడీబి వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ సవరపు, అడిషనల్ వైస్ ప్రెసిడెంట్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఏపీ ప్రభుత్వ పెట్టుబడిదారుల అనుకూల పారిశ్రామిక విధానాలను ప్రశంసించిన శ్రీసిటీ జపనీస్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ వైస్ ఛైర్మెన్ మకోటో సాటో, పరిశ్రమలు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అన్ని సమస్యలకు సాధ్యమైన పరిష్కారాలను కనుగొంటామని డాక్టర్ సృజన హామీ ఇచ్చారు. ఏపీలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు చొరవ చూపాలని ఆమె కాన్సుల్ జనరల్, జెట్రో ప్రతినిధులను కోరారు. ఇసుజు మోటార్స్, యునిచార్మ్, కోబెల్కో కన్స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్, మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్, ఐసన్ ఆటో పార్ట్స్, టోరే ఇండస్ట్రీస్, పియోలాక్స్, మియామా ఎలక్ట్రిక్, హెడ్, ఎంయుఎఫ్‌జి బ్యాంక్ తదితర శ్రీసిటీ జపనీస్ ఇండస్ట్రీస్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, శ్రీసిటీ సీనియర్ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# వేలకోట్ల సిలికాను దోచేస్తున్నారు

## ఓబులాపురం తరహాలో జిల్లాలో మరో భారీ కుంభకోణం

### - సోమిరెడ్డి ఆరోపణ

గూడూరు డివిజన్ చిల్లకూరు, కోట మండలాల్లో అత్యంత అరుదైన సిలికా ఖనిజాన్ని మైనింగ్ మాఫియా దోచుకుంటోందని, ఈ మూడేళ్లలో 3వేల కోట్ల దోపిడీ జరిగిందని, ఇది మరో ఓబులాపురం దోపిడీలా తయారైందని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. ఈనెల 4న అమరావతిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు.

కోస్టల్ కారిడార్, ఇండస్ట్రియల్ కారిడార్, అసైన్డ్, డీ.కే.టీ, ఏపీఐఐసీ, సాగరమాల భూములతో పాటు సొన కాలువలనూ కూడా మైనింగ్ మాఫియా వదలడం లేదని, సీబీఐతో పాటు ఈడీ, ఫెమా, జీఎస్టీ, ఎన్జీటీ విభాగాలు జోక్యం చేసుకోవాల్సినంత పెద్ద కుంభకోణం ఇదని సోమిరెడ్డి చెప్పారు. ఈ సిలికా తవ్వకాలకు సంబంధించి 3వేల ఎకరాల్లో 78మందికి మాత్రమే లీజులు ఉన్నాయని, టీడీపీ ప్రభుత్వ హయాంలో మైనింగ్ చట్టంప్రకారమే జరిగేదని తెలిపారు. అయితే, వైసీపీ ప్రభుత్వం రాగానే సొంత పార్టీకే చెందిన లీజుదారుల మెడపై కత్తిపెట్టి, రూ.300 కోట్ల పెనాల్టీలు వేసిందని, టన్ను సిలికాపై రూ.70గా ఉన్న ట్యాక్స్ ను రూ.300లకు పెంచారు. కోవిడ్ ట్యాక్స్ పేరుతో రూ.200లు అదనంగా భారం మోపారని,



లీజు కాలపరిమితి 5ఏళ్లు, 10 ఏళ్లున్నా టన్ను రూ.100కే విక్రయించాలని హుకుం జారీ చేశారన్నారు. అలా తక్కువ ధరకు కొనుగోలు చేసిన సిలికాను టన్ను రూ.700కు, రూ.800లకు అమ్ముకుంటున్నారని తెలిపారు, సేల్స్ పాయింట్ సింగిల్ పాయింట్ అయ్యాక టన్ను రూ.1485లకు అమ్ముకుంటున్నారు. జీఎస్టీ మాత్రం రూ.700కే కడుతున్నారని, దాన్ని వాషింగ్ ప్లాంట్లలో క్లీన్ చేసి, టన్ను రూ.4వేలకు పైబడి అమ్ముతున్నారని, జీఎస్టీ 50 శాతం ఎగ్గొడుతున్నారని వివరించారు. ఈ దోపిడీ ద్వారా మైనింగ్ మాఫియాకు ఇంచుమించు ఎకరాకు రూ.4.5 కోట్లు వస్తోందన్నారు. పర్యావరణ శాఖ నిబంధనల ప్రకారం 2.50 మీటర్ల లోతుకు మాత్రమే తవ్వకాలు అనుమతిస్తే, అక్కడ 5 నుంచి 6 మీటర్ల వరకు తవ్వుతున్నారన్నారు. జీపీఎస్ మ్యాప్ ద్వారా విచారణ జరిపినా ఈ వ్యవహారం బయటపడుతుందన్నారు. ఇప్పుడు వెళ్లినా అక్కడ జరిగే తవ్వకాలు చూడొచ్చన్నారు.

### సిబిఐ విచారణ జరిపించాలి

ఇప్పటికి దాదాపు 2 కోట్ల టన్నుల సిలికా శాండ్ ఎత్తేశారని, అనధికారికంగా ప్రభుత్వ భూముల్లో ఇంచుమించు 70 నుంచి 80 లక్షల టన్నులు తవ్వేశారని సోమిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతుంటే కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. చిన్నచిన్న వ్యాపారులపై జీఎస్టీ కట్టలేదని దాడులుచేసేవారికి, ఇంతభారీ దోపిడీ కనిపించడంలేదా? దేశం.. రాష్ట్రం ఏమైపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ వెంటనే ఈ సిలికా మైనింగ్ వ్యవహారాన్ని సీబీఐతో విచారణ జరిపించాలన కోరారు. అయిదారు లక్షల టన్నుల మైనింగ్‌కు సంబంధించిన కొండకు పరదా కట్టేసి ఈ దురాగతానికి పాల్పడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఈ భారీ దోపిడీని సహించేది లేదని, అవినీతిని అడ్డుకునేందుకు కృషి చేస్తామన్నారు.

# వేమన పద్యాలు అద్వితీయం

### - జిఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్

సరళమైన భాషతో, సున్నితమైన అర్థాన్ని చెప్పగలిగిన గొప్ప కవి వేమన అని, ఆ మహాకవి పద్యాలు అద్వితీయమైనవని, ఆయన అందరికీ ఆదర్శప్రాయుడని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ మరియు సెంట్రల్ జిఎస్టీ డాక్టర్ సి.హెచ్ ఉషాకిరణ్ పేర్కొన్నారు. నెల్లూరులోని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4న నెల్లూరు జాకీర్‌హుస్సేన్ నగర్‌లోని ఎస్‌విఆర్ హైస్కూల్‌లో విద్యార్థులకు వేమన శతక పద్య పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. స్కూల్ కరెస్పాండెంట్ అందే శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ బి.రమేష్‌బాబు, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు, కవి అంకబాబు తదితరులు పాల్గొన్నారు.



## చుక్కల భూములకు త్వరలో మోక్షం

రైతులు, భూముల యజమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న చుక్కల భూముల సమస్య ఒక కొలిక్కి రానుంది. జిల్లావ్యాప్తంగా దాదాపు 43వేల ఎకరాల చుక్కల భూములకు త్వరలోనే మోక్షం కలగనుంది. ఆమేరకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా అధికారయంత్రాంగం చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి గత కొంతకాలంగా చేస్తున్న కృషి వీలైనంత త్వరలో ఫలించనుంది. ఇటీవల జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు కావలిలో ఆర్డీఓ కార్యాలయంలో కొత్తగా ఏర్పాటుచేసిన సభా మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం త్వరలో ఇక అందరూ ఆ సమస్యాత్మక చుక్కల భూముల నుంచి విముక్తి పొందవచ్చని భరోసా ఇచ్చారు.

## ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఉత్సాహంగా క్రికెట్ పోటీలు జరిగాయి. బుజబుజనెల్లూరులోని సిఎంఎ, నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలలో జరిగిన ఈ పోటీల్లో జిల్లావ్యాప్తంగా ఉన్న క్రికెట్ క్లబ్‌ల నుంచి 50 జట్లు పాల్గొన్నాయి. మార్చి 31వ తేదీతో పోటీలు ముగిశాయి. ఏఎల్‌ఎంసిసి జట్టు, లార్డ్స్ సిసి జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో ఏఎల్‌ఎంసిసి జట్టు విజయం సాధించింది. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ యతిరాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులందజేశారు. క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి నిఖిలేశ్వర్‌రెడ్డి, అబూబకర్, మునిగిరీష్, మాజీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.




# ఎన్‌బికెఆర్‌లో 'హుండాయ్' ప్రాంగణ ఎంపికలు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల హుండాయ్ మోటార్స్ ఇండియా ఇంజనీర్స్ వారిచే ప్రాంగణ ఎంపికలు జరిగాయి. బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్ విభాగాల్లోని విద్యార్థులకు జరిగిన ఈ ఎంపికల్లో భాగంగా తొలుత ఆన్‌లైన్ పరీక్షను నిర్వహించారు. మొత్తం 347 మంది ఈ పరీక్షలు రాయగా 157 మంది టూల్‌టెస్ట్‌కి ఎంపికయ్యారు. ఈ పరీక్షలో 68 మంది విద్యార్థులు టెక్నికల్ ఇంటర్వ్యూలకు ఎంపిక కాగా, వీరిలో 28మంది హెచ్‌ఆర్ రౌండ్ ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. ఈ పరీక్షలో కూడా ఎంపికైన విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తామని, వార్షిక వేతనం 5 లక్షలు ఉంటుందని తెలిపారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి డా.ఎన్ కిషాంధర్ తదితరులు పర్యవేక్షించారు.

## జాతీయసదస్సు ప్రారంభం

ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐఇటిఇ స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో ఈనెల 3న 'ఆవిష్కార్ 2కె23' జాతీయస్థాయి సాంకేతిక సదస్సు ప్రారంభమైంది. సమన్వయకర్త ప్రొ.బి సుబ్బారెడ్డి జ్యోతి ప్రజ్వలనం చేసి మాట్లాడుతూ, సాంకేతికపత్రాల ప్రదర్శన పట్ల ఆసక్తితో ఉండి, వాటిని క్షుణ్ణంగా అభ్యసించి, తగు రీతిలో మార్పులు చేసి ప్రదర్శనకు సమాయత్తం కావాలని విద్యార్థులకు సూచించారు. ఇసిఇ విభాగాధిపతి డా.జి.హరినాథరెడ్డి, కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల నుంచి వందకు పైగా సాంకేతిక పత్రాలు, 40కి పైగా గోడప్రతాలు, 20కి పైగా ప్రాజెక్టులు వచ్చాయని, వాటిలో ఉత్తమ ప్రదర్శనకు బహుమతులుంటాయని తెలిపారు.

## ఎన్‌బికెఆర్ గ్రంథాలయాధికారికి..పురస్కారం

విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో గ్రంథాలయాధికారిగా ఉన్న పి.రామిరెడ్డి రాసిన పరిశోధన వ్యాసం ఐసిఎస్ఎస్ఆర్ జాతీయ సెమినార్‌లో ఉత్తమ పరిశోధనగా ఎన్నికైంది. కర్నూలులోని సిల్వర్‌జుబ్లీ ప్రభుత్వ కళాశాలలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఎన్‌బికెఆర్ కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ డా. వి. విజయకుమార్‌రెడ్డిలు ఆయన్ను అభినందించారు.



# వివిఎస్‌యులో మహిళా క్రీడలు

నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వ విద్యాలయం (వివిఎస్‌యు) ప్రాంగణంలో అంతర్ కళాశాలల మహిళాక్రీడల టోర్నమెంట్‌ను ఇటీవల వివిఎస్‌యు ఉపకులపతి ఆచార్య జి.ఎం సుందరవల్లి ప్రారంభించారు. క్రీడలు ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయని, విద్యార్థినులు, మహిళలు కూడా క్రీడల్లో బాగా రాణించాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విజేతలకు ఆమె బహుమతులు ప్రదానం చేశారు. వివిఎస్‌యు రిజిస్ట్రార్ ఆచార్య పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య విజయనంద్ కుమార్ బాబు, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డా. కె.సునీత పాల్గొన్నారు.

ఈ క్రీడల్లో టెన్నికాయిట్ విన్నర్స్‌గా వివిఎస్ యూనివర్సిటీ-నెల్లూరు, రన్నర్స్ గా డీకేడబ్ల్యు కళాశాల-నెల్లూరు బహుమతులు సాధించారు. అదేవిదంగా, టేబుల్ టెన్నిస్‌లో విన్నెర్స్‌గా డీకేడబ్ల్యు కళాశాల, నెల్లూరు, రన్నర్స్‌గా వివిఎస్‌యు పీజీ సెంటర్-కావలి, షటిల్ బ్యాడ్మింటన్‌లో విన్నర్స్‌గా డీకేడబ్ల్యు కళాశాల-నెల్లూరు. రన్నర్స్‌గా వివిఎస్‌యు-నెల్లూరు జట్లు బహుమతులందుకున్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ రవీంద్రమ్మ, పీడీలు డా. ప్రవీణ్ కుమార్, మణికంఠ తదితరులు పర్యవేక్షించారు.

# మాట తప్పని నేత.. సిఎం జగన్



రాష్ట్ర చరిత్రలోనే ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి ఒక్క హామీని క్రమం తప్పకుండా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతోందని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి కొనియాడారు. ఈనెల 2న ఆయన మనుబోలు మండల కేంద్రంలోని సిపిఆర్ కళ్యాణ మండపంలో వైఎస్ఆర్ ఆసరా మూడో విడత రుణమాఫీ నిధులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మహిళలనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ, పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు స్వయం సహాయక సభ్యులకు ఆసరా 3వ విడత నిధులను సీఎం విడుదల చేస్తున్నారన్నాని, జిల్లాలోని 34,440 గ్రూపులకు 826కోట్లు మంజూరు చేసారన్నారు. 'నవరత్నాల' పథకాల ద్వారా మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారన్నారు. అనంతరం మనుబోలు మండలానికి సంబంధించిన 603 సంఘాల్లోని 6039 మంది సభ్యులకు వైఎస్ఆర్ ఆసరా 3వ విడత మొత్తం 4కోట్ల 28 లక్షల 29 వేల రూపాయల చెక్కును మహిళలకు అందచేశారు. డిఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఏరియా కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు, పొదుపు సంఘాల్లోని మహిళలు పాల్గొన్నారు.

## ఈదూరు రామాలయంలో.. కన్నులపండువగా కల్యాణోత్సవం



తోటపల్లిగూడూరు మండలం ఈదూరు గ్రామంలోని శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానంలో మార్చి 22 నుంచి ఏప్రిల్ 1వ తేది వరకు అంగరంగవైభవంగా వసంత నవరాత్రోత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మార్చి30న శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారి కల్యాణోత్సవం, అదేరోజున గరుడ సేవ కన్నులపండువగా జరిగాయి. మార్చి 31న పట్టాభిషేక మహోత్సవం, ఏప్రిల్ 1న గంధవడి ఉత్సవం, ఏకాంత సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రావి మోహన్‌చౌదరి, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్



## 'వందేభారత్' ట్రైల్‌రన్ సక్సెస్

సికింద్రాబాద్ - తిరుపతి మధ్య 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్' ట్రయిల్‌రన్ విజయవంతమైంది. తిరుపతి నుండి మధ్యాహ్నం 3.15 గంటలకు ప్రారంభై రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, నల్గొండ మీదుగా సికింద్రాబాద్ చేరుకుందని గూడూరు స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు, ఆర్‌పిఎఫ్ సిఐ వై.లక్ష్మీనారాయణ తెలిపారు. గూడూరు రైల్వేస్టేషన్ నందు వారు హాజరై ట్రయిల్‌రన్‌ను పరిశీలించారు. ట్రయిల్‌రన్ విజయవంతం కావడంతో రైలును ఈ నెల 8న ఉదయం 11.30 గంటలకు ప్రధాని నరేంద్రమోడీ చేతులమీదుగా ప్రారంభించనున్నారని, ఆరోజు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ళ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతూ తిరుపతికి చేరుకోనుందని, టికెట్ ధర రెండ్రోజుల్లో దక్షణ మధ్య రైల్వే ప్రకటించనుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌పిఎఫ్ సిఐ వై.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ట్రైన్ మీద రాళ్ళు విసరడం కాని, రైల్వే ట్రాక్ దాటడం కాని చేయవద్దని విజ్ఞప్తి చేశారు. అటువంటి ప్రయత్నాలు చేస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



## మహావీర్ జయంతి వేడుకలు

గూడూరు పట్టణంలోని త్యాగరాజ వీధిలో ఉన్న జైన్ మందిరంలో మహావీర్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. పల్లకి సేవను కన్నులపండువగా నిర్వహించారు. జైన్ సంఘం సభ్యులు అశోక్ మాట్లాడుతూ మహావీర్ స్వామి పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించామని, అలాగే వేసవి కాలం దృష్ట్యా మజ్జిగ చలివేంద్రం, అన్నదాన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.

## పేదలకు పలసరుకులు




గూడూరు డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సిద్ధారెడ్డి జనార్ధన్‌రెడ్డి ఆసరా పేరుతో ఈ నెల 2వ తేదీ 20 మంది పేదలకు పల సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాస్పర స్కూల్ కరస్పాండెంట్ బుసారెడ్డి దశరథరామిరెడ్డి మాట్లాడుతూ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, వారి కుమారుడు సిద్ధారెడ్డి సుధీర్‌రెడ్డి సహాయసహకారాలతో పేద రెడ్డి బంధువులకు ప్రతి నెల ఒకటో ఆదివారం నెలకు సరిపడా పలసరుకులు ఇవ్వడం జరుగుతోందని తెలియజేశారు. రాఘవరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, కట్ట మురళీకృష్ణ, సిద్ధారెడ్డి కృష్ణారెడ్డి, ధనుంజయరెడ్డి, సురేష్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

### పంచాయతీ రాజ్ ఇంజినీర్ ఇలియాజ్‌కు
## రాష్ట్ర స్థాయి ప్రశంసా అవార్డ్



చిల్లకూరు మండలంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారిగా పనిచేస్తున్న షేక్ ఇలియాజ్ అహ్మద్‌కు రాష్ట్రస్థాయి ప్రశంసా అవార్డు లభించింది. ఈ నెల 4వ తేదీ జిల్లా పంచాయతీ రాజ్ సుపరింటెండెంట్ ఇంజనీర్ శంకర్ నారాయణ ప్రశంసా పత్రాన్ని గూడూరు పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయం నందు ఇలియజ్ అహ్మద్‌కు ఇచ్చి, వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరినాథ్ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ చిల్లకూరు మండలంలో పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ ద్వారా జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయడమే కాకుండా, మండల స్థాయిలో అన్ని పనులు ప్రారంభించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపినందుకు ఆయనకు ఈ అవార్డ్ రావడం జరిగిందన్నారు. పంచాయతీరాజ్ డి.ఈ కేవీ రవీంద్రకుమార్, డివిజన్ కార్యాలయం ఇంజనీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీపై కేసులు హేయం



గోపాలకృష్ణ యాదవ్

కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై అక్రమ కేసులు బనాయించడం హేయమైన చర్య అని ధర్మరాజుల స్వామి దేవాలయం మాజీఛైర్మెన్ గోపాలకృష్ణ యాదవ్ పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీ గూడూరు పట్టణంలోని సొసైటీ ప్రాంతంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీపై లేనిపోని కేసులుపెట్టి, జైలుశిక్ష విధించడం సరికాదని, తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

# సమన్వయంతో పనిచేయాలి

## జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రాధాన్యత పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో డివిజన్ స్థాయిలోని అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు సూచించారు. కావలి రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన సమావేశ మందిరాన్ని ఆయన ఇటీవల ఆర్డీఓ శీనా నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం వేసవి కాలంలో ఎక్కువ ఉష్ణోగతలు పెరిగే అవకాశం వుందని వాతావరణ శాఖ తెలిపిన నేపధ్యంలో ప్రజలు ఎక్కడా త్రాగునీటికి ఇబ్బంది పడకుండా ముందస్తు ప్రణాళికతో సంబంధిత శాఖల అధికారులు పనిచేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రధాన రహదారి కూడళ్ళ వద్ద, స్కూల్స్, హాస్పిటల్స్, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద త్రాగునీటి వసతి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కావలి పట్టణ పరిధిలో అందరికీ ఇళ్ల కార్యక్రమం కింద మెగా లే-అవుట్‌లో పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతోందని, 3వేల గృహాల్లో ఒకేసారి గృహప్రవేశాలు జరిగేలా ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వ భూమికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చుక్కల భూముల సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని, ఈ సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో ఒక ప్రత్యేక సెల్‌ను కూడా ఏర్పాటుచేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి వెంకటరమణ, ఇంచార్జీ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులరెడ్డి, తహశీల్దార్ మాధవరెడ్డి పాల్గొన్నారు.

# డీడీ వెంకటేశ్వరప్రసాద్‌కు వీడ్కోలు



జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి ముమ్మడి వెంకటేశ్వరప్రసాద్‌కు కార్యాలయ అధికారులు, సిబ్బంది ఇటీవల ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి వారి కార్యాలయంలో డీడీగా విధులు నిర్వర్తించి కృష్ణా జిల్లా మచిలీపట్నంకు బదిలీ అయిన వెంకటేశ్వరప్రసాద్ విధి నిర్వహణలోఎంతో సమర్థవంతంగా పనిచేశారని సిబ్బంది కొనియాడి, శాలువాలతో ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఐఈ కిశోర్, డివిజనల్ పిఆర్వో రమేష్, ఎపిఆర్వో రవీంద్ర, పిఆర్వో వినోద్ కుమార్, సీనియర్ సహాయకులు సుబ్బమ్మ, సువర్ణ, ఏవీస్ ఫరీద్, ఫోటోగ్రాఫర్లు శివరాంప్రసాద్, గురుప్రసాద్, వీడియోగ్రాఫర్లు సాయినాథ్, అరుణ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సోమిరెడ్డిని కలిసిన

# రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు



తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని అల్లీపురంలోని ఆయన నివాసంలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్-గూడూరు బ్రాంచ్ నాయకులు కలిసి, ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించడంపై అభినందనలు తెలిపారు. విజయవాడలో జరిగిన ఆలిండియా ఇండియా రైల్వే ఫెడరేషన్ సభలో తీర్మానించిన మేరకు న్యూ పెన్షన్ స్కీమ్‌కు వ్యతిరేకంగా, ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌కు సానుకూలంగా టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇవ్వాలని ఆ యూనియన్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి రాఘవేంద్ర, యూత్ ఛైర్మెన్ శేఖర్, యూత్ కో-ఆర్డినేటర్ మనోహర్, కేవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి వచ్చిందో...

# సంక్షేమం గోవిందా!

## నెల్లూరు ఎంపీ ఆదాల జోస్యం



పొరపాటున తెలుగుదేశం పార్టీ గనుక అధికారంలోకి వస్తే ప్రస్తుత సంక్షేమ కార్యక్రమాలు ఆగిపోతాయని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్‌లోని కొత్త వెల్లంటి, పాత వెల్లంటిలో ఇటీవల జరిగిన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశాల్లో ఆయన డిసిసిబి మాజీ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ దేశంలో బిజెపి పాలిత రాష్ట్రాల్లో కూడా ఏపీలో ఉన్నన్ని సంక్షేమ కార్యక్రమాలు లేవన్నారు. టిడిపి హయాంతో ఇప్పటి సంక్షేమాన్ని గమనిస్తే తేడాను ఏమిటో అర్థమవుతుందని పేర్కొన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ అమల్లోకివచ్చాక ఎన్నో సమస్యలకు స్థానికంగాన ప్రజలకు పరిష్కారం దొరికిందన్నారు. విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రూరల్ మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్, స్థానిక సర్పంచులు లక్ష్మమ్మ, రాధమ్మ, రవీంద్రరెడ్డి, రాంగోపాల్, దేవసేనమ్మ, కోటేశ్వరరెడ్డి, మారం శ్రీనివాస్‌రెడ్డి, చెంచయ్య, వెంకటరమణయ్య, జడ్పీటీసీ మల్లు సుధాకర్ రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, తాటిపర్తి వెంకటేష్, ఆర్‌ఎస్‌ఆర్ పాల్గొన్నారు.

### ప్రజలకు అందుబాటులో అర్బన్ హెల్త్ సెంటర్ :

సీఎం జగన్ వైయస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్స్ పథకం కింద నెల్లూరులో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా, చక్కగా నిర్మించారని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ప్రశంసించారు. నెల్లూరులోని 34 డివిజన్లో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఎంపీ ఆదాల ఇటీవల ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గానికి 6 హెల్త్ సెంటర్లు మంజూరయ్యాయని, అందులో 4 ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. మిగతా 2 కూడా త్వరలో పూర్తవుతాయని పేర్కొన్నారు. డిసిసిబి మాజీ ఛైర్మెన్ విజయకుమార్‌రెడ్డి, నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, నగర కమిషనర్ హరిత, డి.ఎం.హెచ్.ఓ పెంచలయ్య, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

### ములుముడి-కందమూరు రోడ్డు 6 నెలల్లో పూర్తిచేస్తాం

ములుముడి- కందమూరు రోడ్డును 8 కోట్ల రూపాయల అంచనాతో ఆరు నెలల్లో పూర్తి చేస్తామని నెల్లూరు ఎంపీ ఆదాల హామీ ఇచ్చారు. కందమూరులో ఇటీవల జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సమస్యల పరిష్కారానికి గ్రామాలను సందర్శిస్తూ, ఆత్మీయ సమావేశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

### అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించాలి

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల కాలంలో రాష్ట్రంలో చేసిన అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆదాల చెప్పారు. నెల్లూరు రూరల్ పరిధిలోని సచివాలయ కన్వీనర్లతో ఇటీవల ఆయన నివాసంలో జరిగిన సమావేశంలో ఆదాల మాట్లాడుతూ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు వాలంటీర్ల ద్వారా గత నాలుగేళ్లలో జరిగిన లబ్ధిని ప్రజలకు వివరించాలని కోరారు.

# 'స్పందన' అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

ప్రజల నుంచి స్పందన కార్యక్రమానికి అందే అర్జీలు మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. ఈనెల 3వ తేదీ నెల్లూరు కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో ఆయన డిఆర్ఓ వెంకటనారాయణమ్మతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, స్పందన అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. జడ్పీ సీఈవో బి.చిరంజీవి, డిఆర్‌డిఏ, డ్వామా, ఏపీఎంఐపీ, గృహ నిర్మాణసంస్థ పీడీలు సాంబశివరెడ్డి, వెంకటరావు, శ్రీనివాసులు, వెంకటదాసు, డిటిసి చందర్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు నివేశన స్థలాలివ్వాలి

నెల్లూరు నగర శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములను పేదలకు నివేశన స్థలాలుగా ఇవ్వాలని కోరుతూ ఈనెల 3న నెల్లూరు రూరల్ సిపిఎం ఆధ్వర్యంలో నగరంలోని వీఆర్‌సి సెంటర్ వద్ద నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, వావిలేటిపాడు, కల్లూరుపల్లి, గుండ్లపాళెం తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను ఇళ్లు లేని నిరుపేదలకు పంచాలని కోరారు. కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, ఆ మేరకు డిఆర్ఓ వెంకటనారాయణమ్మకు వినతిపత్రం అందజేశారు. రూరల్ నియోజకవర్గం సిపిఎం కార్యదర్శి బత్తల కిష్టయ్య, నాయకులు కిన్నెరకుమార్, వీర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

## టూకీగా...



### జొన్నవాడలో..వరదరాజస్వామి ధ్వజస్తంభానికి పూజలు

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పుణ్యక్షేత్రం జొన్నవాడలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వరదరాజస్వామి ఆలయంలో కొత్తగా నెలకొల్పిన ధ్వజస్తంభానికి ఈనెల 2న ఆలయ ఛైర్మెన్ ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. బ్రహ్మచక్రం, శ్రీపీఠం తదితరాలు ఏర్పాటుచేసి పూజలుచేసి, నవగ్రహ హోమాలు జరిపించారు.

### సహకారశాఖ అధికారిణిగా.. సుధాభారతి

జిల్లా సహకారశాఖ అధికారిణి (డిసిఓ) సుధాభారతి నియమితులయ్యారు. ఆమేరకు రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి తాజాగా ఉత్తర్వులొచ్చాయి. ప్రస్తుతం ఆమె నెల్లూరులో డిఎల్‌ఓసీగా పనిచేస్తున్నారు. త్వరలోనే డిసిఓగా బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం.

### కోవూరులో వ్యవసాయాధికారుల సమావేశం

మండల కేంద్రమైన కోవూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో ఈనెల 3న సహాయ వ్యవసాయ సంచాలకురాలు సుజాత ఆధ్వర్యంలో 5 మండలాల పరిధిలోని వ్యవసాయాధికారులతో సమావేశమై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. 'పొలం బడి' కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని, ఏప్రిల్ 10 లోగా రైతుల నుంచి ఈకెవైసి పూర్తిచేయించాలని ఆదేశించారు.

### కామాక్షితాయి అమ్మవారి దేవస్థానానికి విరాళం

జొన్నవాడ కామాక్షితాయి దేవస్థానంలో అన్నదానానికి రేబాలకు చెందిన అహల్యమ్మ తన భర్త బి.ఆదిశంకర్‌రెడ్డి జ్ఞాపకార్థం పాతిక వేల రూపాయలు, రెండు శాశ్వత నవ వరణ పూజలకు 32,232 రూపాయలను తమ కుటుంసభ్యుల ద్వారా ఈనెల 1న విరాళంగా సమర్పించారు. ఆలయ అర్చకులు దాతలకు దైవదర్శనం చేయించి ఆశీర్వదించారు.

### అల్లిమడుగులో 'పోషణ్ పక్వాడా'

బోగోలు మండలంలోని అల్లిమడుగు ఎస్‌సి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఈనెల 3న 'పోషణ్ పక్వాడా' కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు పోషక విలువలున్న ఆహారం ఇవ్వాలన్నారు. వెల్‌బేబీ షో నిర్వహించి పిల్లలకు ప్రోత్సాహక బహుమతులిచ్చారు. ఉపాధ్యాయులు మరియమ్మ, సంజీవరాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

### సోమశిలలో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ

అనంతసాగరం మండలం సోమశిలలో హిల్‌కాలనీ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఈనెల 1న శ్రీ పోలేరమ్మ అమ్మవారి పంచలోహ విగ్రహానికి వేదపండితులు ప్రాణప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించారు. అదేరోజు రాత్రి అమ్మవారికి గ్రామోత్సవం వేడుకగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

### వరికుంటపాడులో చలివేంద్రం

మండల కేంద్రమైన వరికుంటపాడులో ఈ వేసవిలో ప్రయాణీకుల దప్పిక తీర్చేందుకు బస్టాండ్ సెంటర్‌లో స్థానిక ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎస్ఐ బాలమహేందర్‌నాయక్, సర్పంచ్ కొండేపోగు దిలీప్‌కుమార్‌లు పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించి, ప్రయాణీకులకు చల్లని మజ్జిగ, మంచినీళ్ళు అందజేశారు.

### బుచ్చి నగరపంచాయతీ కార్యాలయం మార్పు

బుచ్చిరెడ్డిపాళెంలోని గాంధీనగర్‌లో ఇప్పటిదాకా ఉన్న నగర పంచాయతి కార్యాలయాన్ని శ్రీ చైతన్య పాఠశాల సమీపంలో ఉన్న ప్రభుత్వ భవనంలోకి మార్చినట్లు కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం ప్రజలు ఈ మార్పును గమనించాలని ఆయన కోరారు.

### ముత్తుకూరులో విద్యార్థులకు చిరుద్యోగి వితరణ

మండల కేంద్రమైన ముత్తుకూరులో ఒక ప్రైవేట్‌స్కూల్‌లో ఆయాగా పనిచేస్తున్న రవీంద్రమ్మ అనే చిరుద్యోగి, తన సొంత డబ్బులు వెచ్చించి డా. బిఆర్ అంబేద్కర్ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న 10వ తరగతి విద్యార్థులు 90 మందికి విద్యాసామగ్రిని వితరణగా అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# కన్నులపండువగా.. 'హనుమాన్ భక్త శోభాయాత్ర'





- 'జై శ్రీరామ్' నినాదాలతో మార్మోగిన నెల్లూరు
- వేలాదిమంది భక్తులతో నగరంలో భారీ ఊరేగింపు

**'జై శ్రీరామ్', 'జై హనుమాన్'.. అంటూ నెల్లూరు నగరం మార్మోగింది. వేలాదిమంది ప్రజలు, భక్తులతో జరిగిన 'హనుమాన్ భక్త శోభాయాత్ర' ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరంలో 'హిందూ చైతన్యవేదిక' ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఈనెల 2న పెద్దఎత్తున జరిగిన శోభాయాత్ర భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తజనులతో.. మరో జాతరను తలపించింది.**

శ్రీరామనవమి పర్వదినాలను పురస్కరించుకుని శ్రీరామనవమి నుంచి హనుమజ్జయంతి దాకా దేశవ్యాప్తంగా ప్రజలు.. సకల సద్గుణశోభితుడైన ఆ శ్రీరామచంద్రునిపై, రామభక్త హనుమాన్‌పై తమ భక్తిని చాటుకుంటూ ఎంతో కోలాహలంగా 'శోభాయాత్ర'లు నిర్వహిస్తున్న నేపథ్యంలో, హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలో ఈనెల 2న 'హనుమాన్ భక్త శోభాయాత్ర'ను నయనానందకరంగా నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో స్థానిక ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వద్ద నుంచి యాత్ర ప్రారంభమైంది. శ్రీరామచంద్రుని 20 అడుగుల విగ్రహం, హనుమాన్ చిత్రపటాలకు పూజలుచేసి యాత్రను ప్రారంభించారు.

అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగిన ఈ పూజల్లో 'నుడా' ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్ పాల్గొని, జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. యువత ద్విచక్రవాహనాలపై శోభయాత్రను అనుసరించగా, మహిళలు, పెద్దసంఖ్యలో ప్రజలు దారిపొడవునా పూలవర్షం కురిపించారు. నగరంలోని అనేక కూడళ్ళు భక్తజనంతో నిండిపోయాయి. మద్రాసు బస్టాండ్ సెంటర్, ట్రంకురోడ్డు, శివాజీ సెంటర్, రాయాజీవీధి, స్టోన్‌హౌస్‌పేట తదితర ప్రాంతాల్లో భక్తులు మరింత పెద్ద సంఖ్యలో బారులుతీరి శోభయాత్రను స్వాగతించారు. ఈ యాత్రలో పలువురు దేవతామూర్తుల వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు స్వయంగా వచ్చి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు జరగకుండా యాత్ర పూర్తయ్యేవరకు ఉండి, ఏఎస్పీలు హిమవతి, ప్రసాద్‌తో పాటు డిఎస్పీలు తదితర పోలీసు అధికారులకు సూచనలిస్తూ కనిపించారు. బిజెపి నాయకులు గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్, వాకాటి నారాయణరెడ్డి, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, పి.సురేంద్రరెడ్డితో పాటు విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్ నాయకులు పాల్గొని శోభాయాత్రను నేత్రపర్వంగా నిర్వహించారు. పార్టీలకతీతంగా పలువురు ప్రముఖులు, పలు రాజకీయపక్షాల వారు పాల్గొని యాత్రను విజయవంతం చేశారు.

# కొత్తూరులో 12 నుంచి.. పంచామృతాభిషేకాలు

■ శ్రీ షిరిడీ సాయి, శ్రీ యోగాంజనేయస్వామివార్లకు విశిష్టపూజలు ■





ఇందుకూరుపేట మండలం కొత్తూరు గ్రామంలో ఉన్న ప్రసిద్ధమైన శ్రీ షిరిడీ సాయి, శ్రీ యోగాంజనేయ స్వామి దేవాలయాల వార్షిక వేడుకల్లో భాగంగా ఏప్రిల్ 12 నుంచి 16వ తేది వరకు ఎంతో భక్తి శ్రద్ధలతో విశిష్ట పూజలు జరుగనున్నాయి. ఏప్రిల్ 13వ తేది ఉదయం 11 గంటల నుంచి శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయంలో సాయినాధునికి, 15వ తేది ఉదయం 11 గంటల నుంచి శ్రీ యోగాంజనేయస్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారు. మండల పూజల్లో భాగంగా, 16వ తేదిన నాగదేవత పూజ, మధ్యాహ్నం 11 గంటలకు నాగదేవతకు పంచామృతాభిషేకం చేస్తారు. ఆలయ ధర్మకర్తలు కలికి కోదండరామిరెడ్డి-శ్రీలత దంపతుల ఆధ్వర్యంలో ఈ విశేషపూజలు జరుగనున్నాయి. ఈ నాలుగు రోజులు మధ్యాహ్నం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ జరుగుతుందని, భక్తులు పాల్గొని స్వామివార్ల కృపాకటాక్షలను పొందాలని నిర్వాహకులు కోరారు.

# బాబు జగజ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

సమాజంలో అసమానతలు రూపుమాపి, ప్రతి ఒక్కరూ సమైక్యంగా జీవించాలనే లక్ష్యంతో సమాజాభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన గొప్ప దార్శనికుడు, మహా మానవతావాది డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈనెల 5 బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా నెల్లూరు వేదాయపాలెం కూడలిలోని ఆయన విగ్రహానికి నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్‌తో కలిసి మంత్రి కాకాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ, దేశానికి విశేష సేవలు చేసిన వారిలో అగ్రగణ్యుడు బాబు జగ్జీవన్‌రామ్ అన్నారు. దేశానికి ఉప ప్రధానిగా, అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రతిఒక్కరు కూడా ఆ మహనీయుని అడుగుజాడల్లో పయనించి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో అణగారిన వర్గాల కోసం కృషి చేసిన గొప్ప మానవతావాది జగ్జీవన్‌రామ్ అని, ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జగజ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటయ్య, ఆర్డీఓ మలోల, ఎస్సీ



ఎస్టీ సంఘాల నాయకులు కేసి పెంచలయ్య, కుడుముల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో...

డా. బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతిని పురస్కరించుకొని ఈనెల 5న కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో డా. బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి జేసీ కూర్మనాథ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు వెంకటయ్య, ఎపిఎంఐపి పీడీ శ్రీనివాసులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పెన్నా సిమెంట్స్ ఛైర్మెన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ పుట్టంరెడ్డి ప్రతాప్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఏప్రిల్ 6, గురువారం ఉదయం తిరుమలలో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఆ సంస్థల పౌరసంబంధాల అధికారి(పిఆర్‌ఓ) వై.ఎల్.దీపక్‌రెడ్డి

# ఇక్కడ జగన్ - అక్కడ పవన్

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తా... లేదంటే కార్పొరేషన్ ఛైర్మెన్ పదవులు ఇస్తా! అంతేగాని మిమ్మల్ని మాత్రం వదులుకోను అంటూ తనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించారు. "రాజకీయాలంటే మానవ సంబంధాలన్న ముఖ్యమైన అంశాన్ని నాన్నను చూసి నేర్చుకున్నాను. మీరంతా మళ్ళీ గెలవాలి, మనం అధికారంలోకి రావాలి. ఆ లక్ష్యంతోనే అప్పుడప్పుడూ కొంచెం కటువుగా ప్రవర్తించవలసి వచ్చింది. మిమ్మల్ని అలర్ట్‌చేసి గాడిలో పెట్టడమే నా ధ్యేయం. ఒక్కరిని కూడా వదులుకోను. ఎమ్మెల్యేలను, పార్టీ కార్యకర్తలను ఎప్పటికీ దూరం చేసుకోను. మరో ఏడాదిలో ఎన్నికలు రానున్నాయి, మనం మారీచులతో యుద్ధం చేస్తున్నాం, మనమంతా ఒక్కటిగా ఉండి సమిష్టిగా ఉంటేనే మళ్ళీ అధికారంలోకి రాగలం. 175కి 175... మన లక్ష్యం. మనం అధికారంలోకి రాకపోతే కోట్లమంది ప్రజలు నష్టపోతారు" అంటూ జగన్ తనవాళ్లకే హితోపదేశం చేశారు. 'ఎక్కడ నెగ్గాలో కాదు... ఎక్కడ తగ్గాలో తెలిసినోడే గొప్పోడని' పవన్ కళ్యాణ్ సినిమాలోని డైలాగ్‌ని జగన్‌మోహన్‌రెడ్డి ఆచరించినట్లుగా ఈ రెండు రోజుల సమావేశంలోనూ ఆయన బాగా తగ్గి కనిపించారు.

రొటీన్‌కి భిన్నంగా జరిగిన సమావేశంలో జగన్ వైఖరి చూసి ఖంగుతినడం ఈసారి పార్టీ శ్రేణుల వంతయ్యింది. 3వతేదీ మీటింగ్ పార్టీ వర్గాలతో అనగానే రకరకాల ఊహాగానాలకు తెరలేచింది. ముందస్తు ఎన్నికలు, మంత్రివర్గంలో మార్పులూ, అసెంబ్లీ రద్దు... అంటూ సామాజిక మాధ్యమాలు ఊదరగొట్టాయి. అందరి ఊహలు, అంచనాలు తారుమారు చేస్తూ జగన్ సందేశం సాగడంతో ఏదో జరుగుతోందనుకున్న వారి అంచనాలు తారుమారయ్యాయి. విశ్లేషకులతో పాటు తమకు రాజయోగం పట్టబోతోందని కలలు కన్న కొంతమంది పార్టీ నేతలు కూడా ఏప్రిల్ ఫూల్స్ కాక తప్పలేదు.

## నా టీం, నా ధైర్యం మీరే...

ఏప్రిల్ 4వతేదీ ప్రాంతీయ సమన్వయకర్తలు, ఇన్‌ఛార్జిలతో మాట్లాడిన ముఖ్యమంత్రి, అక్కడ కూడా ముందురోజు ధోరణే ప్రదర్శించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ నా టీం, నా ధైర్యం మీరే అన్నారు. పార్టీలో ఎక్కడైనా చిన్నచిన్న లోటుపాట్లుంటే తన దృష్టికి తేవాలని సూచించారు. మళ్ళీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులకు స్ఫూర్తి కల్పించాలన్నారు. గడప గడప కార్యక్రమాన్ని ఉధృతం చేయాలని చెప్పారు. సమయం లేదు మిత్రమా... అన్నట్లుగా మరో ఏడాదిలో రానున్న ఎన్నికల కోసం ఇప్పటినుండే సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. మంత్రివర్గంలో స్వల్ప మార్పులు చేయాలనే ఆలోచన ఉన్నా... తాజా పరిణామాల దృష్ట్యా ఆ తేనెతుట్టెను కదిలించడం అంత శ్రేయస్కరం కాదని మార్పులు, కూర్పుల జోలికి ముఖ్యమంత్రి వెళ్ళలేదని పార్టీ అగ్రనేతలే చర్చించుకోవడం గమనార్హం.

## పొత్తుల సంగతి తేల్చండి...

ఇక్కడ రాష్ట్రంలో జగన్ తన సొంత పార్టీ శ్రేణులతో రెండు రోజులు గడిపితే, అక్కడ ఢిల్లీలో జనసేనాని పవన్ కళ్యాణ్ భాజపా పెద్దలతో సమావేశమయ్యారు. అదే ఏప్రిల్ 3, 4తేదీలలో పవన్ ఢిల్లీలో పర్యటించారు. తామిద్దరమే కలిసి పోటీ చేయబోతున్నామా..? లేక తెలుగుదేశంతో చేతులు కలుపబోతున్నామా..?? అన్న విషయం తేల్చాలని ఆయన ఢిల్లీలో గడప గడప యాత్ర చేపట్టారు. జగన్ వ్యతిరేక ఓటును చీలనీయబోమని పవన్ తరచూ చెప్తూనే ఉన్నారు. అదే క్రమంలో బీజేపీ, టీడీపీతో కలిసి పోటీచేస్తేనే ఆంధ్రాలో జగన్‌కి గట్టి పోటీ ఇవ్వగలమన్న ధీమాతో ఆయన పావులు కదుపుతున్నారు. భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపి నడ్డా, ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఛార్జ్ మురళీధరన్‌తో పాటు పలువురు కేంద్రమంత్రులను కూడా పవన్ కలిశారు.

"దమ్ముంటే నువ్వు ఒంటరిగా పోటీ చెయ్యి", "ధైర్యవంతుడివైతే నిన్ను నువ్వు ముఖ్యమంత్రిగా ప్రకటించుకో" అంటూ పవన్ కళ్యాణ్‌ని రెచ్చగొడుతున్నారు వైసీపీ శ్రేణులు. అయితే, ఈ విషయంలో పవన్ ఎక్కడా బ్యాలన్స్ తప్పడంలేదు. వైసీపీ ఆడుతున్న మైండ్‌గేమ్‌లో ఆయన పావు కాదల్చుకున్నట్లు లేదు. ఎవరు ఎంత రెచ్చగొట్టినా అయన నోటినుండి నేనే ముఖ్యమంత్రి అన్న మాటే రావడంలేదు. వ్యతిరేక ఓటును చీలనీయకూడదు అని ఆయన నమ్ముకున్న సిద్ధాంతంపైనే ఆయన గట్టిగా ఉన్నట్లు స్పష్టమైపోతుంది. మొత్తానికి ఏప్రిల్ 3, 4తేదీలలో ఇద్దరు ఆంధ్రా నేతలు భవిష్యత్ రాజకీయ కార్యకలాపాలపై వ్యూహరచన చేయడంతో రాష్ట్రంలో ఏడాది ముందే ఎన్నికల వేడి మొదలైందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# చమత్కారపు వాతలు.. రాయుడి రాతలు..!

## • రాజమండ్రిలో 'మనలోమాట' పుస్తక పరిచయ సభలో ఉండవల్లి అరుణ్‌కుమార్

సమకాలీన రాజకీయ పరిణామాలపై, మన 'లాయర్'లో భోగాది వెంకటరాయుడు తనదైన వ్యంగ్యశైలిలో గత రెండేళ్ళకుపైగా రాస్తున్న "మనలో మాట" కాలమ్ కథనాల సంకలనాన్ని పుస్తకరూపంలో తీసుకొచ్చిన విషయం 'లాయర్' పాఠకులకు తెలిసిందే. ఈ సంకలనాన్ని భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు జనవరిలో నెల్లూరులో ఆవిష్కరించారు. విశేష ఆదరణ లభించిన ఈ పుస్తక పరిచయ కార్యక్రమంతో పాటు వెంకట రాయుడి అభినందన కార్యక్రమం ఏప్రిల్ 2వ తేదీ ఆదివారం రాజమండ్రిలో జరిగింది.

ఈ కార్యక్రమానికి మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. సీబీఐ మాజీ జేడీ వివి లక్ష్మీనారాయణ, ఆంధ్రజ్యోతి సంపాదకులు కే.శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా హాజరై పుస్తకాన్ని సంయుక్తంగా పునరావిష్కరణ గావించారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, ఒకప్పటి పాత్రికేయంలో ఉన్నత విలువలు, ప్రమాణాలు ఇప్పుడు లేకపోవడం ఆవేదన కలిగిస్తోందని అన్నారు. కేవలం డెబ్బై ఏళ్ళ



వ్యవధిలో మనసమాజంలో పరిస్థితులు ఇంతగా మారిపోవడానికి కారణాలు ఏమిటో అర్థంకావడం లేదన్నారు.

"మనలో మాట"లో కథనాలను, వ్యాఖ్యలను అరుణ్‌కుమార్ ప్రస్తావిస్తూ ఇటువంటివి చదివినప్పుడు ఇంకా స్వతంత్రస్వరాలు ఉన్నాయన్న విశ్వాసం కలుగుతోందని అన్నారు. చమత్కారపు వాతలతో రాయుడి రాతలు వుంటాయని అన్నారు.

ఆంధ్రజ్యోతి సంపాదకుడు కే.శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రవిభజన సమయంలో ఆంధ్ర రాజకీయనాయకత్వం, పౌర సమాజం ఆంధ్రప్రాంతపు అభివృద్ధికి అవసరమైన అంశాలపై దృష్టిపెట్టని రోజుల్లో రాయుడు దూరదృష్టితో రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం రాసిన కథనాలు ఎంతో విలువైనవని అన్నారు. తానుకూడా ఆంధ్రజ్యోతిలో వీక్లీ కాలమ్ రాస్తుంటానని, రాయుడు 'లాయర్' పత్రికలో "మనలో మాట" కాలమ్‌లో రాసిన కొన్ని అంశాలను చూసి తన రాతలను పోల్చుకుంటూ ఉంటానని శ్రీనివాస్ అన్నారు.

రాయుడు లాంటి పాత్రికేయులు అరుదుగా ఉంటున్నారని, అటువంటి స్వతంత్ర నిష్పాక్షిక స్వరాల అవసరం సమాజానికి ఎంతైనా ఉందని సీబీఐ మాజీ జేడీ వివి లక్ష్మీనారాయణ అన్నారు!

కవులు, రచయితలు, జర్నలిస్టులు నిరంతరం ప్రజలతరపున ప్రతిపక్షపాత్ర పోషిస్తారని, రాయుడు కూడా ధిక్కార స్వరంతో తన అభిప్రాయాలని ముక్కుసూటిగా నిర్భయంగా వ్యంగ్యంగా చెబుతారని అంటూ ఐ.జే.యు. జాతీయకార్యదర్శి డి.సోమసుందర్ రాయుడుని ప్రశంసించారు. చివరిగా ఆ నాటి కార్యక్రమ హీరో భోగాది వెంకటరాయుడు మాట్లాడుతూ "జలయజ్ఞం" ప్రాజెక్టులపై తాను పుస్తకం రాయడానికి దారితీసిన పరిస్థితులను విపులంగా వివరించారు. వై.ఎస్. రాజశేఖరరెడ్డే స్వయంగా ఆ పుస్తకాన్ని జూబిలీహాలులో ప్రభుత్వం తరపున ఆవిష్కరించారన్నారు.

తాను ఎక్కువకాలం ఉద్యోగంచేసిన కాకినాడ కంటే రాజమండ్రిలోనే తనకు స్నేహితులు ఎక్కువన్నారు. వివి లక్ష్మీనారాయణ , కే.శ్రీనివాస్ హాజరై పుస్తకాన్ని సంయుక్తంగా ఆవిష్కరించడం తనకు గర్వకారణమని ధన్యవాదాలు తెలిపారు.

ముఖ్యఅతిథులను రాజమండ్రి ప్రెస్ క్లబ్ తరపున ఉండవల్లి అరుణ్‌కుమార్ సత్కరించారు. రాజమండ్రి మాజీఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు రచయిత భోగాది వెంకటరాయుడును, అతిథులను సత్కరించారు. రాయుడిని పలువురు మిత్రులు పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు! సీనియర్ పాత్రికేయుడు వైవిఎస్ కృష్ణకుమార్ సభకు స్వాగతం పలికారు.

ఏ.పి.యు.డబ్ల్యూ.జే రాష్ట్రకార్యదర్శి మండేల శ్రీరామ్మూర్తి వందనసమర్పణ చేశారు. గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పూర్వపు ఛైర్మెన్, సాక్షి సాయంకాల దినపత్రిక అధినేత గన్ని కృష్ణ, ఐ.జే.యు. జాతీయకార్యదర్శి డి.సోమసుందర్, సీనియర్ పాత్రికేయుడు విక్రమ్ పూల, ఆత్మీయఅతిథులుగా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, సామాజికకార్యకర్త యమునా పాఠక్, రాజమండ్రి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి సారథి, సీనియర్ పాత్రికేయులు పెద్దాడ నవీన్, యు.సూర్యచంద్రరావు (వి – రాగి) ఆంధ్రజ్యోతి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్ ఇన్‌ఛార్జ్ బి.హెచ్.వి.మంగేష్, బ్రాంచ్ మేనేజర్ ఎస్. శ్రీనివాస్ , సీనియర్ పాత్రికేయులు ఎ.ఆర్.వి. సత్యనారాయణ, ఎన్‌క్యూబ్, మేడపాటి శ్రీనివాసరెడ్డి, కొండ్రెడ్డి శ్రీనివాస్, గుండా రామకృష్ణ, చిర్ల రాజేంద్రప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు!

---

# వైసీపీతో పొత్తే బీజేపీకి ఉత్తమం!



రాష్ట్ర శాసనసభకు రానున్న ఎన్నికల్లో... తన ప్రత్యర్థి ఎవరో రాష్ట్ర బీజేపీ ఒక పట్టాన తేల్చుకోలేక సతమతమవుతున్నట్టు కనపడుతోంది. రాష్ట్రంలో రెండు బలమైన రాజకీయపార్టీల మధ్య రాష్ట్ర రాజకీయం చీలిపోయి ఉంది.

'అయితే వైసీపీ... కాకపోతే టీడీపీ'. లేకపోతే... 'అయితే జగన్... కాకపోతే చంద్రబాబు' అన్నట్టుగా రాజకీయాలు నడుస్తున్నాయి. ఈ సమీకరణలలో జనసేన అంటూ రాష్ట్ర రాజకీయాలలో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటూ వ్యయప్రయాసలు పడుతున్న పవన్‌కళ్యాణ్ స్థానం ఎక్కడ అనేది, ఆయనకు తప్ప ఇతరులకు తెలియడం లేదు. రాష్ట్ర బీజేపీ నేతలతో ఆయనకు సయోధ్య లేదు. అందుకని బీజేపీ 'ఢిల్లీ పెద్దలే శరణం గచ్ఛామి' అనుకుంటూ ఢిల్లీ పరిగెడుతున్నారు. 2014 ఎన్నికలకు ముందు పవన్‌కళ్యాణ్ జపం చేసిన నరేంద్ర మోడీ... ఇప్పుడు పవన్‌కళ్యాణ్‌కు అపాయింట్‌మెంట్ ఇవ్వడం మానేశారు. కన్సోలేషన్ ప్రైజ్ కింద పవన్‌కళ్యాణ్ – అమిత్‌షా, జే.పీ నడ్డాల దర్శనం కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు. చివరకు, ఆయన ఎక్కడ... ఎలా తేలుతారో క్లారిటీ లేదు.

ఇక, వామపక్షాలైన సీపీఐ, సీపీఎంలకు మాత్రం స్పష్టత ఉంది. తెలుగుదేశం పార్టీతోనే వారి ప్రయాణం. కొత్తగా రాజకీయ ప్రయాణం ప్రారంభించిన జై భీమ్ పార్టీ అధినేత జే.శ్రావణ్‌కుమార్ కూడా టీడీపీతోనే ప్రయాణించబోతున్నారు. శ్రావణ్ కుమార్‌తో పాటు సీపీఐ నారాయణ, సీపీఐ రామకృష్ణ, సీపీఎం గఫూర్ మొదలైన వారు... వైసీపీ ప్రభుత్వ వ్యవహారశైలిని రోజువారీ విమర్శలతో ముంచెత్తుతున్నారు. అందువల్ల, వీటి రాజకీయ ప్రయాణానికి సంబంధించి ఎటువంటి అయోమయం లేదు. వైసీపీకి వచ్చే ఎన్నికల్లో ఈ పార్టీలు ఎదురొడ్డి నిలువబోతున్నాయి.

బీజేపీ విషయంలోనే స్పష్టత రావడం లేదు. లేకపోతే, స్పష్టత ఉండగూడదు అనే విషయంలో బీజేపీ నాయకులకు స్పష్టత ఉన్నదేమో, తెలియదు.

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీచేసిన బీజేపీకి డిపాజిట్ కూడా దక్కకపోవడంపై బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా ఉన్నాయి. తాము వైసీపీకి అనుకూలంగా ఉన్నామనే ప్రచారం పెద్ద ఎత్తున జరిగిందని, అది కరెక్ట్ కాదని ఆయన అన్నారు. బీజేపీ అభ్యర్థికి డిపాజిట్ రాకపోవడానికి, వైసీపీకి బీజేపీ అనుకూలంగా ఉందనే ప్రచారానికి లింక్ ఏమిటో సోము వీర్రాజు వివరించలేదు. వివరించక పోయినప్పటికీ తాము వైసీపీకి అనుకూలంగా లేము అని ఆయన స్పష్టం చేశారు.

మరి, వచ్చే ఎన్నికల్లో తన ప్రత్యర్థి ఎవరో బీజేపీ పార్టీ స్పష్టం చేయాల్సి ఉంది కదా! జనసేన అయితే, ఒక విషయం స్పష్టం చేసింది. వైసీపీ తన రాజకీయ ప్రత్యర్థి అని పవన్ కళ్యాణ్ 2014 నుంచీ స్పష్టం చేస్తూ వస్తున్నారు. వైసీపీని 2024లో గెలవనివ్వను అని ఘనంగా ప్రకటించారు కూడా. వైసీపీ వ్యతిరేక ఓటు చీలనివ్వను అని పదేపదే ప్రకటిస్తున్నారు. ఆ విధంగా చూస్తే, పవన్ కళ్యాణ్ లక్ష్యం స్పష్టంగానే ఉంది. అయితే ఆ లక్ష్యసాధనకు గానూ ఆయన ఏ మార్గం అనుసరిస్తారు అనే విషయంలోనే ఇంకా స్పష్టత లేదు.

వైసీపీకి ప్రధాన ప్రత్యర్థి అయిన టీడీపీతో పొత్తుపెట్టుకుని, వైసీపీ వ్యతిరేక ఓటు వీలైనంత తక్కువ చీలే విధంగా వ్యవహరించడం అనేది జనసేన ముందు ఉన్న ఒక పద్ధతి.

సొంతంగా పోటీచేయడం ఒక పద్ధతి. ఏ పద్ధతి అనేది తెలియడానికి మరికొంత సమయం పట్టవచ్చు.

ఇక, రాష్ట్ర బీజేపీ విషయానికి వస్తే... వైసీపీతో కలిసి పని చేయడానికి ఎందుకు బాగా మొహమాట పడుతున్నదో అర్థం కావడం లేదు. అదేమీ అంటరాని పార్టీ కాదు కదా!

- రాష్ట్ర బీజేపీలో ముఖ్యులైన సోము వీర్రాజు, జీవీఎల్ నరసింహారావుకు వైసీపీ పట్ల వ్యక్తిగత విముఖత ఏమాత్రం లేదు.






- చంద్రబాబునాయుడు పట్ల వీరిరువురికీ వ్యక్తిగత అసహనం బాగా ఉందనేది బహిరంగ రహస్యం. వైసీపీని ఏ విషయంలో అయినా విమర్శించక తప్పనిసరి అయినప్పుడు, తెలుగుదేశంపై కూడా ఓ రాయి విసురుతూ ఉంటారు.
- కేంద్ర బీజేపీతో వైసీపీ నేతలకు చక్కని స్నేహ సంబంధాలు ఉన్నాయి.
- రాజకీయాలకు అతీతమైనవి ప్రధానితో తన సంబంధాలు అని స్వయంగా ముఖ్యమంత్రి జగనే విశాఖలో... ప్రధానమంత్రి సమక్షంలోనే ప్రకటించారు.
- వైసీపీని, ముఖ్యమంత్రి జగన్‌ను నిశితంగా విమర్శించే పవన్‌కళ్యాణ్‌తో రాష్ట్ర బీజేపీ నేతలు భుజం భుజం కలిపి పని చేయలేకపోతున్నారు. అసలు పవన్‌కళ్యాణ్ – బీజేపీ వీర్రాజు కలిసి కూర్చొని ఎన్ని నెలలయిందో ఇద్దరికీ గుర్తు కూడా లేదేమో !
- వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలవడం రాష్ట్ర బీజేపీకీ అసలు ఇష్టం లేదు... కేంద్ర బీజేపీకీ ఇష్టం లేదనే సంకేతాలు బలంగానే వెలువడుతున్నాయి.

వైసీపీతో భుజం భుజం కలిపి పనిచేయడానికి రాష్ట్ర బీజేపీకి ఇన్ని అనుకూల కారణాలు కనపడుతూ ఉంటే.. కలిసి పని చేయడానికి రాష్ట్ర బీజేపీ నేతలు ఎందుకు మొహమాట పడుతున్నారో అర్థం కావడం లేదు.

అటు టీడీపీనీ కాదనుకొని, ఇటు వైసీపీతోనూ ఓపెన్‌గా కలవలేక... బీజేపీ రాజకీయంగా చాలా నష్టపోతుందనే చెప్పాలి.

అసలు, వైసీపీకి దూరంగా బీజేపీ ఎందుకు ఉండాలి? వైసీపీని ఎందుకు అంటరాని పార్టీగా బీజేపీ చూస్తోంది? అనేది అర్థం కాని ప్రశ్న.

బీజేపీ కేంద్ర నాయకులది ఒక దారి... రాష్ట్ర నాయకులది మరో దారి అయితే ఎలా? అనేది బీజేపీ క్షేత్రస్థాయి కార్యకర్తలకు సైతం అర్థం కావడం లేదు.

'అవును. వైసీపీతో కలిసి నడుస్తాం. వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తాం. వైసీపీతో కలిసే ఎన్నికల్లో పోటీచేస్తాం' అని సోము వీర్రాజు ఒక్క ప్రకటన చేసి, రాష్ట్ర రాజకీయ గమనాన్ని ఒక్క కుదుపు కుదపవచ్చు. స్తబ్దుగా ఉన్న రాజకీయానికి కరెంటు షాక్ ఇవ్వవచ్చు. వైసీపీ... నాలుగేళ్ళల్లో చేసిన ప్రజా సేవను... బీజేపీ ఒక్క ఏడాదిలో చేసి చూపించవచ్చు. కలిసి రాకుండా తోకాడిస్తున్న పవన్‌కళ్యాణ్‌కు చెక్ పెట్టవచ్చు. రాష్ట్ర బీజేపీ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించవచ్చు.

రాష్ట్ర ఓటింగ్‌లో ఒకటి, ఒకటిన్నర శాతానికి కొంచెం అటు ఇటుగా బలం కలిగిన బీజేపీ, తన బలాన్ని బాగా పెంచుకోవడం కోసమైనా... వైసీపీతో బహిరంగంగా చేతులు కలపాలి.

పవన్‌కళ్యాణ్‌కు కూడా ఆరేడు శాతానికి మించి ఓటింగ్ బలం గత ఎన్నికల్లో వ్యక్తం కాలేదు. ఈసారి కొద్దిగా పెరిగితే, పెరగవచ్చు గానీ, టీడీపీ తోడు లేకుండా ఈ బలం ఒకటి రెండు సీట్లకు మించి గెలవడానికి సరిపోదు. బీజేపీకి అయితే డిపాజిట్లు రావడానికి కూడా సరిపోదు.

వైసీపీకి గత ఎన్నికల్లో దాదాపు యాభై శాతం ఓటింగ్ వచ్చింది. దానికి బీజేపీ ఓటింగ్ శాతం కూడా తోడైతే, ఓ నలుగురైదుగురు బీజేపీ నేతలు శాసనసభ్యులుగా శాసనసభలో అడుగుపెట్టవచ్చు. ఎంపీలూ కావచ్చు. సోము వీర్రాజు, జీవీఎల్ నరసింహారావు, మాధవ్ లాంటి ఇతర బీజేపీ పెద్దలు ఆలోచించాలి.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

# భారత రాజ్యాంగం.. ఓ పవిత్ర గ్రంథం

- నెల్లూరులో.. హైకోర్టు న్యాయమూర్తులు
- సందేశాత్మకం, స్ఫూర్తిదాయకం న్యాయవాదుల జిల్లా సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న జస్టిస్ ఏ.వి.శేషసాయి

'ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్' (ఐఏఎల్)-9వ జిల్లా స్థాయి సదస్సు సందర్భంగా నెల్లూరు నగరానికి ఇరువురు హైకోర్టు న్యాయమూర్తులు, ఒక విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి ముఖ్యఅతిథులుగా రావడంతో న్యాయవర్గాల్లో సందడి కనిపించింది. నెల్లూరు పురమందిరంలో వారి ప్రసంగాలు న్యాయవాద వర్గాలకు ఎంతో ఉత్సాహాన్ని, సంతోషాన్ని కలిగించాయి.

ఈనెల 1న స్థానిక టౌన్‌హాల్ వేదికగా జరిగిన లాయర్ల సదస్సులో న్యాయమూర్తులు భారత రాజ్యాంగం విశిష్టతను గురించి ఎంతో గొప్పగా వివరించారు. రాజ్యాంగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, ఉచిత న్యాయసహాయం పొందడానికి కావాల్సిన అర్హతలు, రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వం ప్రజలకు చేయాల్సిన సేవలు వగైరా అంశాలన్నిటినీ వారు విశదీకరించారు. రాజ్యాంగం కల్పించిన చట్టాలపై న్యాయమూర్తులు, న్యాయవాదులు ఎప్పటి కప్పుడు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. భారత రాజ్యాంగాన్ని ఒక పెద్ద న్యాయశాస్త్ర గ్రంథంగా పరిగణించవచ్చని జస్టిస్ శేషసాయి పేర్కొంటూ, డా.బిఆర్ అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం భగవద్గీత, ఖురాన్, బైబిల్ వంటి అత్యంత పవిత్రమైన గ్రంథమని చెప్పారు. శ్రామికులు-రైతుల హక్కుల కోసం పోరాడిన జస్టిస్ కృష్ణయ్యర్, ఐఏఎల్ స్థాపనలో కీలకపాత్ర పోషించిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది దివంగత పద్మనాభరెడ్డి సేవలను ఆయన గుర్తుచేసి, వారి ఆదర్శాలను కొనియాడుతూ న్యాయవాద వర్గాల్లో స్ఫూర్తిని నింపారు.

మరో న్యాయమూర్తి జస్టిస్ సిహెచ్. మానవేంద్రనాథ్‌రాయ్ మాట్లాడుతూ, మానవహక్కులు -స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పోరాడిన సీనియర్ న్యాయవాది స్వర్గీయ పద్మనాభరెడ్డిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం న్యాయపరమైన అంశాలకు సంబంధించి న్యాయవాదులు వ్యక్తపరచిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు.

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్ తన ప్రసంగంలో, సాంకేతికంగా వస్తున్న మార్పుల ఫలితంగా క్రిమినల్ కేసుల విచారణకు సంబంధించిన పలు అంశాలను విశదీకరించారు.

రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు, ఐఏఎల్ కేంద్ర, రాష్ట్ర నాయకులు చలసాని అజయ్ కుమార్, ముప్పాళ్ళ సుబ్బారావు, వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి తదితర న్యాయరంగ ప్రముఖులు పాల్గొని హైకోర్టు న్యాయమూర్తులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలందజేశారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని, ఐఏఎల్ జిల్లా అధ్యక్షుడు అబ్బయ్యరెడ్డి, ప్రధాన కార్యదర్శి బ్రహ్మం, బార్ అసోసియేషన్ మాజీ ప్రధానకార్యదర్శి ఆర్.రోజారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాగారెడ్డి శ్రీనివాసులరెడ్డికి సత్కారం



న్యాయవాదుల జిల్లా సదస్సు సందర్భంగా నెల్లూరులోని సీనియర్ న్యాయవాది నాగారెడ్డి శ్రీనివాసులరెడ్డి న్యాయవాద వృత్తిని ప్రారంభించి 50 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా న్యాయమూర్తులు శ్రీనివాసులరెడ్డిని ఘనంగా సన్మానించారు.


స్మృత్యంజలి

జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ।
తస్మాదపరిహార్యేర్థే న త్వం శోచితుమర్హసి॥



శ్రీమతి బయ్యపురెడ్డి భారతి గారు
జననం: 10.6.1971 స్వర్గలోకప్రాప్తి : 7.4.2018

మా తృతీయ సోదరి
శ్రీమతి బయ్యపురెడ్డి భారతి గారి
5వ వర్ధంతి సందర్భంగా
వారి దివ్యస్మృతిని స్మరించుకుంటూ..
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని
భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

తమ్ముడు :
మల్లిఖార్జునరెడ్డి కైపు
రాంజీనగర్, నెల్లూరు.
Portland, USA.
మరియు
కుటుంబసభ్యులు


# మైపాడు రోడ్డుకు మహర్దశ

- ఫలించిన ఎమ్మెల్యే ప్రసన్న, సతీష్‌రెడ్డిల కృషి
- 48 కోట్లతో నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్

సాగరతీరం.. దారిపొడవునా కొబ్బరితోటలు.. అందమైన ఆహ్లాదకరమైన వాతావరణం.. అందరినీ ఆకట్టుకుంటున్న మైపాడు బీచ్.. కోవూరు నియోజకవర్గంలోని ఇందుకూరుపేట మండలం గురించి చెప్పాలంటే.. అదొక కోనసీమ లాంటిది. ఎంతోకాలంగా పర్యాటకులను బాగా ఆకట్టుకుంటోన్న మైపాడు సాగరతీరం మరింత ఆకట్టుకునే విధంగా ఉంటుంది. దక్షిణభారతదేశంలో మరో సబర్మతి ఆశ్రమంగా పేరొందిన చరిత్రాత్మకమైన పినాకిని గాంధీజీ ఆశ్రమం కూడా ఉండేది ఈ మండలంలోని పల్లిపాడు గ్రామంలోనే. 1921లో మహాత్మాగాంధీజీ ఇక్కడికి వచ్చి స్వయంగా ఈ ఆశ్రమాన్ని ప్రారంభించారు కూడా. అయితే, మైపాడుకు వెళ్లాలంటే రోడ్డు సరిగా లేకపోవడంతో ఎంతోకాలం నుంచి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. వైకాపా ప్రభుత్వంవచ్చాక దీనికి కొంత చలనం వచ్చింది. ప్రత్యేకించి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఈ రోడ్డు విషయాన్ని ప్రభుత్వందృష్టికి తీసుకుపోవడంతో, రోడ్డు ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపారు. డిఆర్‌డిఓ పూర్వ ఛైర్మెన్, ప్రస్తుత భారత రక్షణశాఖ సాంకేతిక సలహాదారు, మన నెల్లూరీయుడైన డా.సతీష్‌రెడ్డి కూడా పల్లిపాడును సందర్శించడానికి వచ్చిన సందర్భంలో, ఈ రోడ్డు విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా కేంద్రప్రభుత్వ రోడ్డు రవాణా మంత్రిత్వశాఖ నుంచి ఈ రోడ్డు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ రావడం విశేషం. దీంతో, 19.7 కిలోమీటర్ల పొడవున్న నెల్లూరు-మైపాడు రోడ్డును 48 కోట్ల రూపాయలతో నిర్మించనున్నారు. సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(సిఆర్ఐఎఫ్) పథకం కింద నిధులు మంజూరయ్యాయి. ఏదేతైనేం..ఎట్టకేలకు ఎమ్మెల్యే ప్రసన్న, సతీష్‌రెడ్డిల పుణ్యమా అంటూ.. మైపాడు రోడ్డుకు శాశ్వత పరిష్కారం లభించింది. రాబోవు కొన్ని దశాబ్దాల పాటు పర్యాటకులకు సేవలందించేలా నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీకి, కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.


శ్రద్ధాంజలి



జననం
01.07.1938

మరణం
13.04.2021

పెద్దలు, స్ఫూర్తిప్రదాతలు
కాటంరెడ్డి వేణుగోపాలరెడ్డి గారు
పరమపదించి తే. 13.04.2023ది నాటికి రెండేళ్ళు గడవనున్నాయి.
వారి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ..

కాటంరెడ్డి హంసవేణి - భార్య
కుమార్తెలు - అల్లుళ్ళు
కందల ప్రశాంతి - కందల బాబా ప్రసాద్‌రెడ్డి
జక్కా లక్ష్మీప్రసన్న - జక్కా శివనారాయణరెడ్డి
యేటూరు ప్రవీణ - యేటూరు వసుధర్‌రెడ్డి
మనుమలు మనుమరాళ్ళు
గిరిధర్‌రెడ్డి, గౌతమి, కళ్యాణ్‌రంగారెడ్డి, స్వాతి, శ్వేత
సందీప్‌రెడ్డి, శ్రేయ
మరియు ఇతర కుటుంబసభ్యులు


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com